ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపర్ పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
కర్నూలు, డోన్, ఆత్మకూరు, కల్లూరు - 99854 09260
కర్నూలు, కోడుమూరు, నందికొట్కూరు - 9985411379
ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు - 9985171793
నంద్యాల, పాణ్యం, ఆళ్ళగడ్డ, బనగానపల్లె - 9985411377

30 ఏళ్ల కిందటి పథకం



రుద్రవరం మండలంలోని శ్రీరంగాపురం ఎస్ఎస్ ట్యాంకులో శిథిలమైన పంప్ హౌస్

- నేటికీ అతీగతి లేని వైనం
- గండి పూడుస్తామని హామీ ఇచ్చిన అప్పటి ఎమ్మెల్యే
- రూ. కోటి పైపు లైన్ దొంగల పాలు
- రూ. కోటి విద్యుత్ లైన్ కనుమరుగు

రుద్రవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం మండలం శ్రీరంగాపురం గ్రామ సమీపంలో 1994లో రూ.5 కోట్లతో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు పనులు ప్రారంభించారు. అప్పట్లో రూ.3.50 కోట్లతో పనులు చేశారు. రూ.1.50 కోట్ల నిధులు మిగిలిపోయాయి. ఈ పథకం ద్వారా రుద్రవరం మండలంలో శ్రీరంగాపురం, రుద్రవరం, కొండమాయపల్లె, శిరివెళ్ల మండలంలో ఇసుకపల్లె, కొట్టాలుపల్లె, గుండం పాడు, గోవిందపల్లె, చెన్నూరు గ్రామాలకు అందించడం లక్ష్యం. కానీ ఆచరణలో ఇది అమలులోకి రాలేదు.

రూ. కోటి పైపు లైను దొంగల పాలు

సమ్మర్ స్టోరేజీ ట్యాంకు వద్ద నుంచి ఏర్పాటు చేసిన పైపు లైను దొంగలపాలైంది. ఇక్కడి పైపులు కోవెలకుంట్ల ప్రాంతానికి తరలించారు. లక్ష్యం చేరకముందే పైపులైను దొంగలపాలైంది. ప్రస్తుతం మోటార్లు చోరీకి గురయ్యాయి. భవనాలు శిథిలమయ్యాయి. ఇలా సమ్మర్ స్టోరేజీ ట్యాంకు శిథిలావస్థకు చేరుకుంది.

రూ. కోటి విద్యుత్ లైన్లు కనుమరుగు

గాజులపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి శ్రీరంగాపురం వరకు అప్పట్లో కోటి రూపాయలు వెచ్చించి విద్యుత్ లైను ఏర్పాటు చేశారు. ఆ విద్యుత్ లైను కనుమరుగై దొంగలపాలైంది. ఇలా నిధులు వృథా కావడమే తప్ప ప్రజలకు చుక్కనీరు అందడం లేదు. విద్యుత్ లైను పూర్తిగా కనుమరుగు కావడంతో శ్రీరంగాపురం గ్రామ సమీపం నుంచి విద్యుత్ లైను కొత్తగా ఏర్పాటు చేసి అనుసంధానం చేశారు. భవనాలు, ఓవర్ హెడ్ ట్యాంకు, పంపింగ్ రూము అన్నీ శిథిలమయ్యాయి.



కూలేందుకు సిద్ధంగా ఉన్న ఓహెచ్ఆర్ఎస్



ఎస్ఎస్ ట్యాంకు గట్టుకు పడిన గండి

కూటమి ప్రభుత్వం కూడా అంతే..

శ్రీరంగాపురం సమ్మర్ స్టోరేజీ ట్యాంకు పూర్తి చేయించి తాగునీరు అందిస్తారని రుద్రవరం, శిరివెళ్ల మండలాల్లోని 8 గ్రామాల ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. ఈ సమ్మర్ స్టోరేజీ ట్యాంకు మరమ్మతు చేయించి ప్రారంభిస్తే ఈ ప్రాంతంలోని వ్యవసాయ బోరుబావుల్లో భూగర్భజలం పెరుగుతుంది. చుట్టుపక్కల గ్రామాలకు రక్షిత మంచినీరు కూడా అందుతుంది. కానీ కూటమి ప్రభుత్వం కూడా ఏమీ చేయదని ప్రజలకు అనుమానం కలుగుతోంది.

సమ్మర్ స్టోరేజీ ట్యాంకు వెలవెల

నీరు లేక సమ్మర్ స్టోరేజీ ట్యాంకు వెలవెలబోతోంది. సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో ఉన్న పంపింగ్ రూము శిథిలమైంది. సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నీరు లేక కళా విహీనంగా మారింది. సమ్మర్ స్టోరేజీ ట్యాంకుకు 2019లో గండి పడింది. అప్పటి ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి, అప్పటి ఆర్డీవో సందర్శించారు. గండి పూడ్పించి సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో నీరు నిల్వ ఉండేలా చూస్తామని వాగ్దానం చేశారు. కానీ వైసీపీ ప్రభుత్వ కాలంలో నిర్లక్ష్యంగా వదిలేశారు. గండి పూడ్చకుండానే వదిలేశారు.





ఎస్ఎస్ ట్యాంకు గట్టుపై ముళ్ల పొదలు

రూ.23 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం

జలజీవన్ మిషన్ కింద రూ.23 కోట్లతో నివేదికలు ప్రభుత్వానికి పంపించాం. ప్రభుత్వం టెండర్లు పిలిస్తే పనులు ప్రారంభిస్తాం. ఈ ట్యాంకు పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలకు తాగునీరు అందిస్తాం.

- సుబ్రహ్మణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

కర్నూలు న్యూసిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా ఉదయం 9 గంటలకు 1వ స్థాయి సంఘ సమావేశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ఉదయం 11 గంటలకు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి మంత్రులు, ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, అధికారులు, ఎంపీలు, శాసన సభ్యులు హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు. వ్యవసాయం, అనుబంధ శాఖలు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, మత్స్యశాఖ, దేవదాయ శాఖలపై చర్చ ఉంటుందన్నారు. సమావేశానికి ఉమ్మడి జిల్లాల జడ్పీటీసీలు, ఎంపీపీలు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు.

రేషనలైజేషన్ పూర్తి చేయాలి



నంద్యాల నూనెపల్లె, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని ఎన్నికల అధికారులను కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన సమావేశంలో ఈఆర్‌వోలు, రాజకీయ పార్టీ ప్రతినిధులతో రేషనలేజేషన్ ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలను స్వయంగా పరిశీలించి నిబంధనల ప్రకారం ధృవీకరించి ప్రతిపాదనలను సమర్పించాలని ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలో మొత్తం 1629 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటిలో ఐదు కేంద్రాల పేర్లు మార్చామని తెలిపారు. అలాగే 36 పోలింగ్ కేంద్రాల మార్పుకు ప్రతిపాదనలు అందాయన్నారు. నూతనంగా 113 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు అందాయన్నారు. జిల్లాలో 1742 పోలింగ్ కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు సమయంలో ఒకే కుటుంబ సభ్యులు వేర్వేరు కేంద్రాల్లో ఉండకుండా అందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

మద్దతు ధర అందాలి: జేసీ కార్తీక్



నంద్యాల నూనెపల్లె, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతులకు కనీస మద్దతు ధర చెల్లింపులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జేసీ కార్తీక్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో అధికారులతో ధాన్యం కొనుగోలుపై సమావేశం నిర్వహించారు. జేసీ కార్తీక్ మాట్లాడుతూ గ్రేడ్ ఏ రకం వరికి రూ.2389, కామన్ రకం వరికి రూ.2369 చెల్లించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రైతులకు ఎమ్ఎస్‌పీ కంటే తక్కువ ధర చెల్లింపులు జరుగకుండా కఠినంగా పర్యవేక్షించాలన్నారు.

కదులుతున్న అవినీతి డొంక



తనిఖీలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు

- రెండో రోజూ సోదాలు
- ఏసీబీ వలయంలో ఆళ్లగడ్డ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం
- అధికారుల బ్యాంకు ఖాతాలపై ఆరా

ఆళ్లగడ్డ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు తవ్వేకొద్ది అవినీతి డొంక కదులుతుంది. గురువారం రెండో రోజు కూడా ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఏసీబీ డీఎస్పీ సోమన్న ఆధ్వర్యంలో ఈతనిఖీలు ముమ్మరంగా సాగుతున్నాయి. కార్యాలయానికి బయట గొళ్లం పెట్టి మరి పాత రికార్డులను తీసి క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఇప్పటి వరకు జరిగిన భూములు, స్థలాల రిజిస్టర్లు, స్టాంప్ అమ్మిన రికార్డులతో పాటు కార్యాలయంలో పనిచేసే అధికారుల బ్యాంకు ఖాతాలను సైతం తీసి మరి ఆరా తీస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసే అవినీతి అధికారుల్లో ఆందోళన నెలకొంది. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ సోమన్న మాట్లాడుతూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మరిన్ని రోజులు సోదాలు కొనసాగుతాయన్నారు. రూ.100 విలువ గల నాన్ జ్యూడీషియల్ స్టాంపులు 103వరకు రికార్డుల్లో నమోదు చేయకపోవడాన్ని గుర్తించామన్నారు. సీనియర్ అసిస్టెంట్ అనిల్ డాక్యుమెంట్ రైటర్లతో గూగుల్ పే ద్వారా కొంత మొత్తాన్ని వేయించుకొన్నట్లు వెలుగులోకి వచ్చిందని, దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తామన్నారు. చుక్కల భూములు, ప్రభుత్వ భూములు సైతం తప్పుడు సర్వేనంబర్‌లతో రిజిస్ట్రేషన్లు జరిగినట్లు తనిఖీలో గుర్తించామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మరింత లోతుగా దర్యాప్తు చేపడుతామని ఆయన పేర్కొన్నారు.

గజ వాహనంపై ప్రహ్లాదరాయులు



రజత గజవాహనంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు రజత గజ వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. రాఘవేంద్రస్వామి సజీవ సమా ధి పొందిన గురువారం పాడ్యమి శుభదినాన్ని పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య వెండి గజవాహనంపై స్వర్ణ అంబారిలో ప్రహ్లాదరాయలను ఊరేగించారు.

ఇద్దరు టెక్నీషియన్లకు ఏసీబీ నోటీసులు

- విచారణకు హాజరు కావాలని ఆదేశాలు

శ్రీశైలం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): టికెట్ల స్కాంలో ఏసీబీ అధికారులు ఇద్దరు టెక్నీషియన్లకు నోటీసులు ఇచ్చారు. శుక్రవారం విచారణకు హాజరు కావాలని ఆదేశాలు జారీ చేశారు. శ్రీశైల దేవస్థానం ఆదాయానికి గండి కొట్టి టికెట్ల ద్వారా వచ్చే ఆదాయాన్ని దారి మళ్లించిన కేసులో ఇద్దరు టెక్నీషియన్లను విచారించేందుకు కర్నూలు ఏసీబీ అధికారులు సిద్ధమయ్యారు. నోటీసులకు సకాలంలో స్పందించి వివరణ ఇవ్వకపోతే కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు. 2018 ఆగస్టులో బయటపడిన నిధుల మళ్లింపు కేసులో ప్రధాన నిందితులుగా భావిస్తున్న మరికొంత మందిని కూడా విచారించే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు.

12న కర్నూలు జిల్లాకు సీఎం రాక?

- ఇళ్ల ప్రారంభానికి వచ్చే అవకాశం
- ఆదోని మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన అధికారులు



బసాపురంలో పర్యటిస్తున్న అధికారులు

ఆదోని రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు జిల్లాకు వచ్చే అవకాశాలు ఉన్నాయని ముందస్తుగా అధికారులకు సమాచారం రావడంతో వివిధ శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. హౌసింగ్ స్కీం ద్వారా పేదలు నిర్మించుకున్న ఇళ్లను ప్రారంభించడానికి ఈనెల 12న ఆదోనికి సీఎం రావచ్చని అధికారులు టెలి కాన్ఫరెన్స్ హాలులో చెప్పడంతో సబ్ కలెక్టర్ అజయ్ కుమార్, హౌసింగ్ పీడీ చిరంజీవి, తహసీల్దార్ రమేశ్ కుమార్, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆరేకల్లు రామకృష్ణ గురువారం బసాపురం, ఢణాపురం గ్రామాల్లో పర్యటించారు. మండలంలో ప్రభుత్వం సహాయంతో ఎంతమంది 100శాతం ఇళ్లు నిర్మించుకున్నారనే సమాచారాన్ని అధికారులు సేకరిస్తున్నారు. గురువారం రాత్రి ముఖ్యమంత్రి పర్యటన ఉందా? లేదా? అని తెలుస్తుందని అధికారులు తెలిపారు.

ఎస్ఐఆర్‌కు సిద్ధంగా ఉండాలి

వీసీలో పాల్గొన్న కలెక్టర్, జేసీ



సమావేశానికి హాజరైన కలెక్టర్ డాక్టర్ సిరి, జేసీ నూరుల్ ఖమర్

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)-2025కు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోరల్ అధికారి వివేక్ యాదవ్ జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. గురువారం ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఎలక్ట్రోరల్ అధికారి వివేక్ యాదవ్ రాష్ట్ర సెక్రటేరియట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌నిర్వహించారు. కర్నూలు కలెక్టరేట్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఏ.సిరి పాణ్యం నియోజకవర్గ ఈఆర్‌వో, జేసీ నూరుల్ ఖమర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటు హక్కును అర్హులైన వారందరూ జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని వివేక్ సూచించారు. కలెక్టర్ సిరి మాట్లాడుతూ జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)-2025కు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఈఆర్వోలను ఆదేశించారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికి ఓటరుగా నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నా రు. వీసీలో జడ్పీ సీఈవో నాసరరెడ్డి, ఎన్‌డీసీ అనురాధ, కర్నూలు, పత్తికొండ ఆర్డీవోలు సందీప్‌కుమార్, భరత్‌నాయక్ పాల్గొన్నారు.

రాఘవేంద్ర మఠానికి రూ. 2 లక్షలు విరాళం

మంత్రాలయం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి కార్వారుకు చెందిన శ్రీనివాస్ అనే భక్తుడు రూ.2లక్షల విరాళం ఇచ్చినట్లు ఏఏఓ మాధవశెట్టి, మేనేజరు ఎస్కే శ్రీనివాసరావు తెలిపారు. గురువారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్న శ్రీనివాస్ శుక్రవారం సంపూర్ణ అన్నదానసేవకు విరాళం ఇచ్చినట్లు తెలిపారు. దాత కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

ఆళ్లగడ్డ టీచర్‌ను మెచ్చుకొన్న మంత్రి లోకేశ్



కర్రసాము ద్వారా గణితం నేర్పుతున్న టీచర్

ఆళ్లగడ్డ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మండలం కోటకందుకూరు గ్రామం మోడల్ ఉన్నత పాఠశాలలోని గణిత ఉపాధ్యాయుడు వెంకటచంద్రుడును మంత్రి నారా లోకేష్ గురువారం అభినందించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ఆటపాటల్లో మమేకం చేస్తూ, స్నేహపూర్వక విద్యాబోధన ద్వారా లెక్కలు బోధిస్తున్నందుకు సోషల్ మీడియా వేదికగా 'గుడ్ వర్క్.. కీపిటప్' అని మెచ్చుకొన్నారు. గ్రౌండ్‌లోనూ గణితం చెబుతున్న మీ ప్రతిభకు అభినందనలు అన్నారు. కోలాటం, చెక్కభజన, కర్రసాము నేర్పుతూనే వివిధ పరీక్షలకు సిద్ధం చేస్తున్న మీ కృషి స్ఫూర్తిదాయకం అని కొనియాడారు.

మల్లన్న సన్నిధిలో ప్రముఖులు



సినీనటి రవళి

శ్రీశైలం నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను మాజీ మంత్రి రోజా, ప్రముఖ సినీ నటి రవళి దర్శించుకున్నారు. కార్తీక మాసం సందర్భంగా గురువారం వీరు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసుకున్నారు. అనంతరం అమ్మవారి ప్రాకార మండపంలో వేదపండితులు వేదాశీర్వచనాలతో తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు, జ్ఞాపికను అందజేశారు.

8న భక్త కనకదాసు జయంతి

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీ భక్త కనకదాసు జయంతి ఉత్సవం ఈ నెల 8వ తేదీన కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారత అధికారి ప్రసూన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కురువ కులస్థులు, వివిధ కుల సంఘాల నాయకులు, ప్రజలు భారీ ఎత్తున పాల్గొని జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ఆహార శుద్ధి యూనిట్లకు సహకారం



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆహారశుద్ధి యూనిట్లకు పీఎంఎస్ఎంఈ కింద 35 శాతం రాయితీ పొందవచ్చని డీఆర్‌డీఏ రమణారెడ్డి తెలిపారు. గురువారం టీటీడీసీలో డీఆర్డీఏ-సెర్ప్ ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో చిరు వ్యాపారులు ఔత్సాహికులకు వ్యవసాయ, వ్యవసాయేతర, ఆహార ఉత్పత్తులపై అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మారుతి నరసమ్మ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి



విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న లీలా వెంకటశేషాద్రి

కర్నూలు లీగల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని లీలా వెంకట శేషాద్రి అన్నారు. గురువారం స్థానిక బి.క్యాంపులోని డిగ్రీ కాలేజ్ ఫర్ మెన్‌లో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కళాశాలలలో వివిధ న్యాయ సేవల పథకాల గురించి నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ప్రిన్సిపాల్ ఇందిరా శాంతి, వైస్ ప్రిన్సిపాల్ హేమంత్, లీగల్ సర్వీసెస్ సభ్యుడు శ్రీనివాస్, అధ్యాపకులు డా.షకున్నిసాబేగం, వింధ్యావాసిని దేవి, నాగరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): డా. మౌలానా అజాద్ 137వ జయంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక పాత నగరంలోని మైనార్టీ జూనియర్ కళాశాల ప్రాంగణంలో జిల్లా స్థాయిలో మౌలానా ఆజాద్ జీవిత చరిత్ర, జాతీయ సమైక్యతకు, దేశ విద్యాభివృద్ధికి ఆయన చేసిన కృషి అనే అంశంపై పాఠశాల, ఇంటర్, డిగ్రీ, పీజీ స్థాయి విద్యార్థులకు వ్యాసరచన వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ సబీహా పర్వీన్, కన్వీనర్ డా.బి. షంషుద్దీన్ తెలిపారు. ఇంగ్లీషు, ఉర్దూ భాషల్లో పోటీలు నిర్వహించామన్నారు. ఈ నెల 11న జరిగే జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా విజేతలకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేస్తున్నట్లు వివరించారు.

15 వరకు బిర్సా ముండా జయంతి వారోత్సవాలు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ధర్తీ ఆబా భగవాన్ బిర్సా ముండా జయంతి ఉత్సవాలు ఈ నెల 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ సాధికారిత అధికారి బి. సురేష్ తెలిపారు. గురువారం కర్నూలు నగరంలోని రెండు పాఠశాలలను పరిశీలించారు.

నిరక్షరాస్యుల్లో ఉల్లాస్ వెలుగులు

వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ముఖ్యంగా మహిళల్లో అక్షరాస్యత చాలా తక్కువగా ఉండటంతో మహిళా విద్యాభివృద్ధి దృష్టి పెట్టింది. ఇందుకు విద్యా శాఖ మంత్రి విశేష కృషి చేసి ఉల్లాస్ అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. పొదుపు మహిళలు, ఉపాధి కూలీ పనులకు వెళ్లే వారు, చదువు మధ్యలో మానేసిన వారికి విద్యను అందించేందుకు సిద్ధపడింది. పొదుపు సంఘాల్లోని అక్షరాస్యులైన మహిళలకు శిక్షణ ఇచ్చి వారితో విద్యా బోధన చేయిస్తోంది. 2029 నాటికి వంద శాతం అక్షరాస్యతే లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగుతోంది.

- వయోజన విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి
- విద్యా శాఖ ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం
- పొదుపు సంఘాల్లో మహిళలకు శిక్షణ
- పాఠ్య సామగ్రి అందజేత
- పర్యవేక్షకులుగా వివిధ శాఖల అధికారులు



చాగలమర్రిలో అక్షరాభ్యాసం చేస్తున్న మహిళలు

చాగలమర్రి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వయోజన విద్యకు ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం నిరక్షరాస్యుల్లో ఉల్లాస్ కార్యక్రమంతో వెలుగులు నింపుతోంది. మహిళలకు చదవడం, రాయడంతో పాటు డిజిటల్ లావాదేవీలు నిర్వహించేలా తీర్చిదిద్దేందుకు ఉల్లాస్ (అండర్‌స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) అనే పేరుతో వయోజన విద్యాశాఖ ప్రత్యేక కార్యక్రమానికి రెండో విడత శ్రీకారం చుట్టింది. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను, ఉపాధి హామీ పనులు చేసే కూలీలను మధ్యలోనే బడిమానేసి అక్షరాలు మర్చిపోయిన వారిని గ్రామస్థాయిలో గుర్తించారు. ఇందుకు కార్యాచరణ రూపకల్పన చేసి క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్నారు.



వాచకాలు పంపిణీ చేస్తున్న వయోజన అధికారి ఆదినరసింహ

స్వచ్ఛందంగా చదువు చెప్పడానికి..

స్వచ్ఛందంగా చదువు చెప్పడానికి పొదుపు సంఘాల్లో ఆసక్తి ఉన్న మహిళలను గుర్తించి వారికి ఇప్పటికే మండల స్థాయిలో శిక్షణ ఇచ్చారు. పాఠ్యాంశ సామగ్రిని అందజేశారు. ప్రతి గ్రామలో పొదుపు సంఘాల్లో నిరక్షరాస్యులైన 10మంది సభ్యులకు ఒక వలంటీర్ అక్షరాలతో పాటు సంతకాలు చేయడం నేర్పిస్తారు. వర్ణమాల, లెక్కలు కట్టడం, బ్యాంకు లావాదేవీల నిర్వహణ వంటి పలు అంశాలతో పాటు డిజిటల్ చెల్లింపులు, మొబైల్ బ్యాంకింగ్, ఆన్‌లైన్ చెల్లింపులు తదితర అక్షరాస్యతపైన పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తారు. గ్రామాల్లో వెసులుబాటు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు అందరికి ఆమోద యోగ్యమైన ప్రదేశాల్లో ప్రత్యేక తరగతులకు సిద్ధం చేశారు. డీఆర్‌డీఏ, మెప్మా, ఉపాధిహామీ పథకాలలో నిరక్షరాస్యులైన వారిని గుర్తించారు.

2029నాటికి శత శాతం అక్షరాస్యత..

రాష్ట్రంలో అక్షరాస్యత పెంపునకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. 2029 నాటికి శతశాతం అక్షరాస్యత లక్ష్యంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఉల్లాస్ అనే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. జిల్లాలోని 28 మండలాల్లో 1.6 లక్షల మంది నిరక్షరాస్యులు ఉన్నట్లు గుర్తించారు. వీరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రతి పది మందికి ఒక స్వచ్ఛంద మహిళా వలంటీర్‌ను ఎంపిక చేశారు. వీరికి రెండు విడతలుగా శిక్షణా కార్యక్రమం నిర్వహిం చారు. ప్రతి రోజు సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పించాల్సి ఉంది. జిల్లాలో 10 వేల వయోజన విద్యా కేంద్రాలు, 10 వేల మంది వలంటీర్లను ఏర్పాటు చేశారు. వలంటీర్లకు ఉల్లాస్ వాచకాలను కూడా పంపిణీ చేశారు.

వలంటీర్లతో బోధన చేయించేలా...

డీఆర్‌డీఏ పరిధిలోని పొదుపులక్ష్మి గ్రూపుల్లో 50వేల మంది చదువురాని వారిని, ఉపాధి హామీ పనులు చేసుకునే వారిలో 25వేల మంది మహిళలను, మున్సిపాల్టీ పరిధిలోని మెప్మాలో 25 వేల మందిని నిరక్షరాస్యులుగా గుర్తించారు. వీరందరికి వలంటీర్లతో బోధన చేయించేలా ప్రణాళిక చేశారు. ఇందులో 75వేల మంది మహిళలున్నారు. వీరందరికీ 2026 మార్చి చివరి వరకు స్వచ్ఛంద వలంటీర్లు బోధన చేసి అక్షరాస్యులుగా తీర్చిదిద్దేలా చూస్తారు. అనంతరం వారికి ఎన్ఐవోఎస్ పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణత సాధించిన వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేస్తారు. ఉల్లాస్ ప్రక్రియ విజయవంతం చేసేందుకు వివిధ శాఖల అధికారులను పర్యవేక్షకులుగా నియమించారు. వయోజన విద్య సజావుగా సాగేలా వీరు పర్యవేక్షించనున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



మహిళలు డిజిటల్ మోసాలకు గురి కాకుండా అవగాహన కల్పిస్తున్నాం. తెలుగు భాష, గణితం నేర్పడంతో పాటు దైనందిన వినియోగానికి సంబంధించిన నైపుణ్యాలను పెంచుతున్నాం.

● నాగమ్మ, ఏపీఎం, వెలుగు, చాగలమర్రి

సంపూర్ణ అక్షరాస్యత లక్ష్యం

జిల్లాలో సంపూర్ణ అక్షరాస్యత లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నాం. ఉల్లాస్ ద్వారా 10,683 మంది వలంటీర్లను నియమించి నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పిస్తున్నాం. పర్యవేక్షణకు సూపర్‌వైజర్లను నియమించాం. ● విజయభాస్కర్‌రెడ్డి, ఏపీవో, వయోజన విద్య, నంద్యాల

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి టీజీవీ కళాక్షేత్రం



సమావేశంలో ప్రసంగిస్తున్న తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ చైర్మన్ చింతపట్ల వెంకటాచారి

- మూడోసారి దక్కిన గౌరవం
- చైర్మన్ చింతపట్ల వెంకటాచారి
- అలరించిన కర్నూలు ఉత్సవ్-2025 ఆరో రోజే కార్యక్రమాలు

కర్నూలు కల్చరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి టీజీవీ కళాక్షేత్రం వరుసగా మూడోసారి స్థానం పొందిందని ఆ సంస్థ చైర్మన్ చింతపట్ల వెంకటాచారి ప్రకటించారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో రాష్ట్ర అవతరణ వారోత్సవాల్లో భాగంగా, ఏపీ నాటక అకాడమీ, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వారం రోజుల కర్నూలు ఉత్సవ్-2025 ఆరో రోజు గురువారం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ చైర్మన్ చింతపట్ల వెంకటాచారి తొలుత రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ కార్యాలయంలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ప్రకటించిన గోల్డ్ మెడల్‌ను, ప్రశంసాపత్రాలను టీజీ వెంకటేశ్‌కు, కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్యకు అందజేసి వారిని సత్కరించారు. అనంతరం కళాక్షేత్రంలోని కార్యక్రమాలకు విచ్చేసి కళాక్షేత్రంలో తెలుగు తల్లి, పొట్టి శ్రీరాములు చిత్ర పటాలకు పూలదండలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా స్వాతంత్ర్య సమరయోధులు, సీనియర్ రంగస్థల కళాకారుల ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. గురువారం కొనసాగిన ఏకాంకిక పౌరాణిక పద్య నాటక పోటీల కళాకారులకు ప్రశంసాపత్రాలు అందజేసి, వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటాచారి మాట్లాడుతూ ఈ ఏడాది మే 28న దివంగత సినీ నటుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ 101వ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రాల్లోని 101 పాటలకు నృత్య ప్రదర్శనలు ఇచ్చి, తొలి రికార్డు నమోదు చేసుకోగా, ఈ ఏడాది ఆగస్టు 15న నిర్విరామంగా 24 గంటలు, 80 మంది కళాకారులతో నృత్య ప్రదర్శనలిచ్చి రెండో రికార్డును టీజీవీ కళాక్షేత్రం నమోదు చేసుకొందని గుర్తు చేశారు. అలాగే రాష్ట్ర అవతరణ దినోత్సవం నుంచి వారం రోజులు కార్యక్రమాలు నిర్వహించి మూడోసారి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందిందని అన్నా రు. పత్తి ఓబులయ్య మాట్లాడుతూ జిల్లాలో అంతరించి పోతున్న కళలకు జీవం పోసే దిశగా టీజీవీ కళాక్షేత్రం కృషి చేస్తోందని తెలిపారు.

అలరించిన నాటక పోటీలు...ఆకట్టుకున్న అష్టావధానం, సంగీత విభావరి

కర్నూలు ఉత్సవ్-2025లో భాగంగా ఆరో రోజు గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగిన ఏకాంకిక పౌరాణిక పద్య నాటక ప్రదర్శనలు ప్రేక్షకులను కనువిందు చేశాయి. రామాంజనేయ యుద్ధం, గయోపాఖ్యానం, శ్రీకృష్ణరాయబారం, బాలనాగమ్మ, సత్యహరిశ్చంద్ర వంటి నాటకాల్లోని పద్యాలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. సాయంత్రం 7 గంటల నుంచి ప్రారంభమైన గంగుల నాగరాజు అష్టావధానం అలరించింది. అనంతరం నాట్యాచార్యుడు ఆంజనేయులు బృందం శాస్త్రీయ నృత్య రూపకాలు, ఇబ్రహీం, హబీబ్, సుధారాణి, సుజాత, ఖాజావలి, రేఖ, రేలారేలా గోపాల్, శ్రీనివాసులు, బీవీ ప్రకాశ్, రాణి తదితరులు సంగీత విభావరి, జానపద గీతాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కన్వీనర్లు జీవీ శ్రీనివాసరెడ్డి, గాండ్ల లక్ష్మన్న, వాల్మీకి రాముడు, కేవీ రమణ, పీపీ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'అమ్మా'నవీయం

- నందికొట్కూరు ఆసుపత్రిలో నవజాత శిశువును వదిలి వెళ్లిన వైనం
- సీసీ పుటేజీల ఆధారంగా విచారణ.. తల్లి గుర్తింపు
- బిడ్డను తీసుకోవడానికి నిరాకరించిన తల్లి
- ఐసీడీఎస్, పోలీసుల ఆధ్వర్యంలో నంద్యాలకు శిశువు తరలింపు



ఆసుపత్రిలో శిశువును తీసుకుంటున్న ఐసీడీఎస్, పోలీసు అధికారులు

నందికొట్కూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అమ్మా.. ఎందుకిలా చేశావు? ఆ శిశువు మాటలొచ్చి ఉంటే అడిగేదేమో?.. అడిగినా సమాధానం కూడా లేదు ఆ తల్లి వద్ద. బిడ్డను తీసుకోవడానికి ఆ తల్లి నిరాకరించింది. ఈ ఘటన నందికొట్కూరు పట్టణంలో గురువారం జరిగింది. వివరాలివి.. నందికొట్కూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి పట్టణంలో నివాసం ఉంటోంది. గురువారం తెల్లవారుఝామున పట్టణంలోని ఇంటి వద్ద ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఉదయం 11.50 గంటలకు యువతి సోదరి శిశువును నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వచ్చింది. అక్కడ వార్డులో శిశువును పడుకోబెట్టి, తాగునీరు తెచ్చుకుంటామని చెప్పి బయటకు వెళ్లిపోయింది. ఎంతసేపటికీ ఆమె రాకపోవడంతో పక్క బెడ్డులో ఉన్న వారు ఆసుపత్రి సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో శిశువును ఇంక్యుబేటర్‌లోకి తీసుకెళ్లి వైద్యం అందించారు. అలాగే రక్త పరీక్షలు చేశారు. తక్కువ బరువు, వెన్నెముకలో సమస్య ఉందని వైద్యులు గుర్తించారు. ఐసీడీఎస్ అధికారులకు ఆ శిశువును అప్పగించి మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ జకి అక్మానీ తెలిపారు.

ఆ యువతికి మూడో కాన్పు?

నవజాత శిశువును ఆసుపత్రిలో వదిలి వెళ్లడంతో అధికారులు సీసీ పుటేజీలను పరిశీలించారు. ఓ మహిళ ఆ శిశువును వదిలిన దృశ్యాలు రికార్డయ్యాయి. దీంతో ఆసుపత్రి అధికారులు ఐసీడీఎస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు పోలీసులను వెంటపెట్టుకొని పట్టణంలోని కాలనీకి వెళ్లారు. దీంతో శిశువును వదిలివెళ్లిన మహిళ గురించి ఆరా తీయగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ప్రసవం అయిన మహిళ సోదరి గురించి తెలుసుకున్నారు. ఆ మహిళకు ఇది మూడో కాన్పు అని సమాచారం. ఆమెకు పెళ్లి కానట్లు తెలిసింది. మొదటి ఇద్దరి శిశువులను కూడా డబ్బులకు విక్రయించినట్లు తెలుస్తోంది. గురువారం శిశువుకు జన్మనిచ్చింది. ఈ శిశువు గురించి స్థానికులు అడగ్గా.. శిశువు చనిపోయిందని, అంత్యక్రియలు చేయడానికి తన సోదరి వెళ్లిందని ఆ యువతి చెప్పినట్లు సమాచారం. తమ వివరాలు బయటపెడితే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని ఆ యువతి ఐసీడీఎస్ అధికారులను బెదిరించినట్లు తెలిసింది.

బిడ్డను తీసుకోవడానికి నిరాకరించిన తల్లి

మరోసారి ఇలా జరగకూడదని కాలనీ వాసులు ఆసుపత్రికి వచ్చి ఫిర్యాదు చేయడంతో కుటుంబ సభ్యులను, ప్రసవం అయిన మహిళను ఆసుపత్రి వైద్యులు పిలిపించి ఎంఎల్‌సీ చేసినట్లు తెలిసింది. ఐసీడీఎస్ సీడీపీవో మంగవల్లి తన సిబ్బందితో అక్కడి వెళ్లి శిశువు ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బిడ్డను తీసుకోవడానికి తల్లి నిరాకరించింది. దీంతో ఆ వైద్యుల వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం నంద్యాల ఆసుపత్రికి తరలించారు.

స్వానిధితో అండ

- చిరు వ్యాపారులకు రుణ సాయం పెంపు
- మరో ఐదేళ్ల పాటు పొడిగింపు
- చిరు వ్యాపారుల్లో హర్షం



నంద్యాల టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పీఎం స్వానిధి పథకం(లోక కల్యాణ్)తో చిరు వ్యాపారులకు ఆర్థికంగా అండగా నిలుస్తోంది. 2030 వరకు కొనసాగించడంతో పాటు రుణ సాయాన్ని కూడా పెంచాలని కేంద్రం నిర్ణయించింది. చిరు వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకాన్ని 2020లో ప్రారంభించారు. ఈ ఏడాదితో ముగియనుండడంతో దీన్ని మరో ఐదేళ్ల పాటు పొడిగించి కేంద్రం చిరు వ్యాపారులకు చేయూతనందించింది. ప్రస్తుతం నంద్యాలలో లోక్ కల్యాణ్ మేళా కొనసాగుతోంది.

లోక్ కల్యాణ్ రుణంతో..

ప్రభుత్వం లోక్ కల్యాణ్ రుణంతో కుటుంబం నుంచి ఒక వ్యాపారవేత్తను తయారు చేయాలనే ఆశయంతో ముందుకు సాగుతోంది. నంద్యాల పట్టణంలో వీధి వ్యాపారులకు రుణం అందించనున్నారు. గతంలో ఉన్న పీఎం స్వానిధి-2.0 (లోక్ కల్యాణ్) ద్వారా ప్రధాన మంత్రి మోదీ పుట్టిన రోజు సందర్భంగా లోక్ కల్యాణ్ మేళా పథకానికి శ్రీకారం చుట్టారు. పట్టణంలో గాంధీచౌక్, బస్టాండు ప్రాంతం, టెక్కె ప్రాంతం, నూనెపల్లె, బొమ్మలసత్రం, ఎన్జీవో కాలనీ, శ్రీనివాసనగర్, సంజీవనగర్, వంటి ప్రాంతాలే కాకుండా చుట్టూ పక్కల ప్రాంతాలైనా మహానంది మండలం, గోస్పాడు మండలం నుంచి చాలా మంది వచ్చి చిరు వ్యాపారం చేసుకునే వారు ఉన్నారు. తోపుడుబండ్లు, పై వీధివ్యాపారం తో కుటుంబాలను పోషించుకుంటున్నారు. తమ పిల్లల్ని చదివించుకుంటు ప్రయోజకులుగా తీర్చిదిద్దుకుంటున్నారు. అలాంటి వీరికి లోక్ కల్యాణ్ పథకం వరమని చెప్పాలి.

నంద్యాల పట్టణానికి సంబంధించి..

వీధి వ్యాపారులు	: 4250
గుర్తింపు కార్డులు ఉన్నవారు	: 3800
పీఎం స్వానిధికి అర్హులు	: 3800
లబ్ధి పొందిన వారు	: 3620
లోక్‌కల్యాణ్ మేళాకు ఎంపికైనవారు	: 820

మెప్మా కార్యాలయంలో రిసోర్స్ పర్సన్ ద్వారా..

మెప్మా కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలి. ఇప్పటికే పట్టణంలో సర్వే నిర్వ హించారు. పేర్లు నమోదైన వారు పట్టణంలోని మెప్మా కార్యాలయంలో సంబంధిత రిసోర్స్ పర్సన్ల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. మొదట రూ.15వేలు అందజేస్తారు. నెలవారి కంతులు సక్రమంగా చెల్లించుకుంటే తర్వాత రూ.25వేలు ఇస్తారు. మూడో విడతలో రూ.50వేలు రుణం ఇస్తారు. డిజిటల్ పేమెంట్ చేయడానికి అవసరమైన క్యూఆర్ కోడ్ ఇస్తారు.

ఆరోగ్య, జీవిత బీమాతో పాటు..

వీధి వ్యాపారులకు ఆరోగ్య, జీవిత బీమాతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక సాయం లభిస్తుంది. 18 ఏళ్లు పైబడిన వారు పట్టణ, స్థానిక సంస్థల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుని ఉన్న వారు, కాయగూరలు, పండ్లు, టీ, కాఫీ, ఫాస్ట్ ఫుడ్, బజ్జీలు, పూలు, చిన్న దుకాణాలు నిర్వహించే వారిని అర్హులుగా గుర్తిస్తారు.

అవగాహన కల్పిస్తున్నాం.

ఇటీవలనే లోక్ కల్యాణ్ మేళా నిర్వహించాం. ఈ పథకం ద్వారా చిరు వ్యాపారులకు ఎంతో మేలు చేకూరుతుంది. తమ కుటుంబాలు ఆర్థికంగా ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దుకోవచ్చు. చిరు వ్యాపారులకు అవగాహన కల్పించి దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నాం.

-బండి శేషన్న, కమిషనర్, మున్సిపల్, నంద్యాల

స్వచ్ఛందంగా దుకాణాల తొలగింపు



దుకాణాలను తొలగించుకుంటున్న నిర్వాహకులు


తొలగించిన దుకాణం పైకప్పు

- ఎట్టకేలకు రోడ్డుకు మోక్షం
- దుకాణ యజమానులకు పలువురి అభినందనలు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎదురుగా ఉన్న దుకాణాలను యజమానులు గురువారం స్వచ్ఛందంగా తొలగించారు. వీరిని పలువురు అభినందించారు. ఎన్నో ఏళ్లుగా రోడ్డుకు అడ్డంగా ఉన్న దుకాణాలను తొలగించాలని నగరపాలక అధికారులు చెప్పినా దుకాణ యజమానులు స్పందించలేదు. ఈ విషయమై అధికారులు గతంలో కోర్టును ఆశ్రయించారు. దుకాణ యజమానులు సైతం కోర్టుకు వెళ్లారు. దీంతో సంవత్సరాల కాలయాపన జరిగింది. ఈక్రమంలో నగరపాలక అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. ఈమేరకు ఇటీవల హైకోర్టు నుంచి దుకాణాలను తొలగించాలని ఉత్తర్వులు వెలువడ్డాయి.

హైకోర్టు ఉత్తర్వుల మేరకు నగరపాలక కమిషనర్ కూడా దుకాణాలను తొలగించాలని యజమానులకు నోటీసులు జారీచేశారు. ఈ క్రమంలో నగరపాలక అధికారుల ఆధ్వర్యంలో దుకాణాల తొలగింపు అవసరం లేదని, తామే స్వచ్ఛందంగా దుకాణాలను తొలగించుకుంటామని యజమానులు ముందుకొచ్చి తొలగించారు. ఎన్నో ఏళ్లుగా సమస్యగా ఉన్న రహదారికి మోక్షం లభించింది.

ప్రాజెక్టులను పూర్తి చేయించాలి

కర్నూలు అర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గుండ్రేవుల, వేదవతి, సిద్ధేశ్వరం అలుగు ప్రాజెక్టులను పూర్తి చేయించాలని జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జి, ఏఐసీసీ సభ్యుడు జె. లక్ష్మీనరసింహ కోరారు. గురువారం విజయవాడలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు కోడుమూరు ఇన్‌చార్జి అనంతరత్నం మాదిగతో కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఆదోని డివిజన్‌లో వలసలను నిర్మూలించాలని, ఆదోనిని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. ఎమ్మిగనూరు కోఆర్డినేటర్ ఖాసింవలి, పత్తికొండ కోఆర్డినేటర్ బి. క్రాంతి నాయుడు, మహేంద్ర నాయుడు, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.


షర్మిలకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సస్యరక్షణతో పంటను కాపాడుకోండి

ఓర్వకల్లు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సస్య రక్షణ చర్యలతో పంటలను కాపాడుకోవాలని ఏవో మధుమతి రైతులకు సూచించారు. బుధవారం ఓర్వకల్లు, హుశేనాపురం, గుట్టపాడు గ్రామాల్లో రైతులు పొగాకు పంటను పరిశీలించారు. ఆకులు పచ్చగా మారడంతో రిడోమిల్ ఎంజీ 2గ్రాముల నీటిని లేదా కాపర్ ఆక్సిక్లోరైడ్ 2 గ్రాములు 1 లీటరు నీటికి లేదా మెటాలాక్సిల్ 2 గ్రాములు లీటరు నీటికి మొక్క మొదలు బాగా తడిసేదాకా వారం వ్యవధిలో మార్చి మార్చి పిచికారీ చేయాలన్నారు. అలాగే అమ్మోనియం సల్ఫేట్ 20 కేజీ ఎకరాకు చొప్పున మొక్కకు 5సీ.ఎం దూరంలో పొలం ఆరేలోపు వేసువాలన్నారు. ఆకులు రాలిపోతున్న పొలాల్లో రిడోమిల్ ఎంజీ 2 గ్రాముల లీటరు నీటికి 19-19-19 రకం 10 గ్రాముల ఒక లీటరు నీటికి పిచికారీ చేస్తే పంట సాధారణ స్థితికి వస్తుందన్నారు.

'అశోకా'అధ్యాపకులకు డాక్టరేట్

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అశోకా మహిళా ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులకు వేరు వేరు విశ్వవిద్యాలయాలు డాక్టరేట్‌ను ప్రదానం చేశాయి. డా.డి.శ్రీదేవి (గణిత శాస్త్రం)కు కుప్పం ద్రవిడ యూనివర్సిటీ నుంచి డా.డీవీ రామిరెడ్డి పర్యవేక్షణలో పీహెచ్‌డీ పొందారు. అలాగే సివిల్ ఇంజనీరింగ్‌లో శివానందరెడ్డి తమిళనాడు, చెన్నై ఎస్ఆర్ఎం సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్ పీహెచ్‌డీలో ప్రొఫెసర్ డా.ఎస్.ఆనంద్ పర్యవేక్షణలో చేశారు. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ విభాగానికి చెందిన డా.ఎంఏ శశి భూషణ్‌కు పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. డాక్టర్ ఎం.సుధాకర్ పర్యవేక్షణలో పీహెచ్‌డీ పట్టాను పొందారు. ప్రిన్సిపాల్ నవీన్, సీఈవో డా.హరీష్‌కృష్ణ అభినందించారు.


శశి భూషణ్, శ్రీనివాసరెడ్డి, డి.శ్రీదేవి

పర్యావరణంపై అవగాహన ఉండాలి



మొక్క నాటుతున్న లీలా వెంకట శేషాద్రి

కర్నూలు అర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ప్రకృగి, పర్యావరణ పరిరక్షణపై అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి అన్నారు. గురువారం ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి, అధ్యాపకులతో కలిసి మొక్కలా నాటారు. వైస్ ప్రిన్సిపాల్ హేమంత్, డా. నాగన్న, శ్రీనివాసరెడ్డి, ఫక్రున్నిసా బేగం, వి. వింధ్యావాసిని దేవీ, కామల్లీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల ఆందోళన

కర్నూలు న్యూసిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని అవుట్ డోర్ స్టేడియం వద్ద చిరు వ్యాపారులు గురువారం ఆందోళనకు దిగారు. గతంలో తాము ఇక్కడే వ్యాపారులు చేసుకునేవారమని నగర పాలక అధికారులు లాటరీలో ఇతరులకు అవకాశం ఇవ్వడంతో తాము ఉపాధి కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు కమిషనర్‌కు విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఆర్.మురళీమోహన్, ఉపాధ్యక్షుడు వెంకటేష్, కార్యదర్శి సి.రఘు, సంయుక్త కార్యదర్శి పవన్ తదితరులు పాల్గొన్నారు.

హైవే నిర్వహణపై నిర్లక్ష్యం వద్దు


హైవేపై గుంతలను చూపుతున్న పట్టణ పౌరులు

కర్నూలు రూరల్ నవంబరు 6(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారి నిర్వహణను నిర్లక్ష్యం చేయొద్దని పట్టణ పౌరుల సంక్షేమ సంఘం నాయకులు పుల్లారెడ్డి, ఫుడ్ బ్యాంక్ అధ్యక్షుడు చంద్రశేఖర్, కాలనీవాసులు యూనస్, జిలానీ డిమాండ్ చేశారు. గురువారం ఆటోనగర్ నుంచి సంతోష్‌నగర్ వరకు దెబ్బతిన్న సర్వీసు రోడ్లను పరిశీలించారు. జాతీయ రహదారికి ఇరువైపులా గుంతలు ఏర్పడి నీరు నిలిచి వాహనదారులకు ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. టోలుగేట్ రుసుం వసూలు చేయడం తప్ప రహదారుల పరిస్థితిని పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంజనేయులు, అన్వర్‌బాషా, శ్రీనివాసులు, నయిమ్, ఆయూబ్, జావేద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో క్రీడల్లోనూ రాణించాలని ఏజీఎం అన్వర్ బాషా సూచించారు. గురవావారం మాధవనగర్ నారాయణ పాఠశాలలో ప్రిన్సిపాల్ మహ్మద్ అల్తాఫ్, కోఆర్డినేటర్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలు, ధ్రువపత్రాలు అందజేశారు.

విద్యుదుత్పత్తి కేంద్రంలో ప్రమాదం

శ్రీశైలం నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం కుడిగట్టు జల విద్యుదుత్పత్తి కేంద్రంలో ప్రమాదం జరిగింది. గురువారం మధ్యాహ్నం సమయంలో కార్మికులు మరమ్మతు పనులు చేస్తుండగా నాల్గవ యూనిట్ ట్రాన్స్‌ఫార్మర్ పేలింది. ఘటనలో ట్రాన్స్‌ఫార్మర్‌కు అనుసంధానంగా ఉండే లైటింగ్ ఎరాస్టర్ ఊడిపోయి సమీపంలో పని చేస్తున్న కిరణ్ అనే కాంట్రాక్ట్ లేబర్ తలకు తగిలి గాయాలయ్యాయి. అప్రమత్తమైన సహసి బ్బంది అతడ్ని సున్నిపెంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కిరణ్ తలకు మూడు కుట్లు పడ్డాయి. అతడి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలిసింది. విద్యుదుత్పత్తి కేంద్రంలో ఘటనతోపాటు కిరణ్ ఆరోగ్య పరిస్థితిపై ఉన్నతాధికారులు ఆరా తీసినట్లు తెలిసింది.


ప్రమాదానికి గురైన ట్రాన్స్‌ఫార్మర్

ప్రైవేటుకు అప్పగించడం తగదు

- బందార్లపల్లె చెక్ పోస్టు వద్ద ఉద్రిక్తత
- తరలి వచ్చిన గనుల యజమానులు, కార్మికులు


రాయల్టీ చెక్‌పోస్టు వద్ద యజమానులు, కార్మికులు

కొలిమిగుండ్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాయల్టీ వసూలు చేసే బాధ్యతను ప్రైవేటు సంస్థకు అప్పగించడం తగదని గనుల యజమానులు అన్నారు. గురువారం మండలంలోని బందార్లపల్లె రాయల్టీ చెక్‌పోస్టు వద్ద గనుల యజమానులు, కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. రాయల్టీ (సీనరేజ్) వసూ లు చేసే విషయంలో ప్రైవేటు సంస్థ అనేక నిబంధనలను పెట్టి నాపరాయి పరిశ్రమ వర్గాలకు తీవ్ర ఇబ్బందులకు కలగజేస్తుందని వారు వాపోయారు. రాయల్టీ చెక్‌పోస్టు వద్దకు కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సీఐ రమేష్‌బాబు తన సిబ్బందితో కలిసి రాయల్టీ చెక్‌పోస్టు వద్దకు చేరుకున్నారు. నిరసన చేపట్టరాదని ప్రైవేటు సంస్థ వారితో చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని సీఐ సూచించారు. అక్కడికి చేరుకున్న అవుకు మండల టీడీపీ అధ్యక్షుడు ఉగ్రసేనా రెడ్డి, మూలే హుసేన్‌రెడ్డి, కల్యాణ్‌రెడ్డి చెక్‌పోస్టు సిబ్బందితో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. రాయల్టీ వసూలు విషయంలో గనుల యజమానులు, కార్మికులతో సమావేశం నిర్వహించి కొన్ని నిబంధనలు సడలించాలని వారు ప్రవేటు సంస్థ సిబ్బందికి వారు విజ్ఞప్తి చేశారు. రెండు రోజుల్లో కొలిమిగుండ్లలో ప్రత్యేక సమావేశం నిర్వహించి చర్చలు జరుపుతామని గనుల యజమానులు వివరించారు. నాపరాళ్ల లోడుతో అక్కడికి చేరుకున్న ట్రాక్టర్లు రాయల్టీ పన్ను చెల్లించకుండానే తాడిపత్రి వైపు తరలివెళ్లాయి.

నిరంతరం విద్యుత్ సరఫరా చేయండి

కల్లూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలను తగ్గించి వినియోగ దారులకు నిరంతరంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని కర్నూలు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ప్రదీప్‌కుమార్ ఆదేశించారు. గురువారం విద్యుత్ భవన్‌లో ఆయన కర్నూలు టౌన్ డివిజన్ విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ వినియోగదారుల్లో పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ పెంచుటకు అధికారులు, విద్యుత్ సిబ్బంది అన్నివేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. పీఎం సూర్యఘర్ స్కీం కింద సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసుకుని విద్యుత్ బిల్లులు తగ్గించుకునేలా ప్రజలకు అవగాహన పెంచాలన్నారు. ఏపీ ఎస్పీడీసీఎల్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సెక్షన్ అధికారి వినియోగదారులకు లోవోల్టేజీ సమస్య లేకుండా చూడాలని, ఓవర్ లోడ్ ఉండే 11కేవీ ఫీడర్లను బైఫర్‌కేట్ చేసి అదనపు ఫీడర్లను ఏర్పాటు చేయాలని ఎస్ఈ ఆదేశించారు. అకౌంట్స్ ఆఫీసర్ చిన్నరాఘవులు, టెక్నికల్ ఈఈ వైవీ.మహేశ్వరరెడ్డి, కన్‌స్ట్రక్షన్ ఈఈ భాస్కర్‌రావు, టౌన్ ఈఈ టి.శేషాద్రి, ఏడీఈ, ఏఈలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

హాలహర్వి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని సిద్ధాపురం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన భీమేష్, శాంతమ్మ దంపతులకు నలుగురు సంతానం. ముగ్గురు ఆడపిల్లలు కాగా నాలుగో సంతానం సోమశేఖర్(12) జన్మించాడు. సోమశేఖర్ గురువారం ఇంట్లో బోరు నీటి కోసం విద్యుత్ బటన్ నొక్కాడు. విద్యుదాఘాతానికి గురై కుప్పకూలిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాలుడు అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. ఒక్కగానొక్క కుమారుడిని మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

వివాహిత బలవన్మరణం

నంద్యాల టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉరేసుకొని ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన పట్టణంలో నబీనగర్‌లో చోటుచేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. కాలనీకి చెందిన కరీమున్(27) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నంద్యాల ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

వ్యభిచారగృహ నిర్వాహకుల అరెస్టు

నంద్యాల టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్న నిర్వాహకులను అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ అస్రర్‌బాషా గురువారం తెలిపారు. వివరాలు.. పట్టణంలోని ఒక ప్రధాన ప్రాంతంలో వ్యబిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం మేరకు ఇంటిపై దాడిచేసి నిర్వాహకులు రమేశ్, మున్నాను అరెస్టు చేశామన్నారు. మరో మహిళను అదుపులోకి తీసుకొని రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

మంత్రాలయం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన బాలుడు తప్పిపోగా పోలీసులు పట్టుకొని తల్లిదండ్రులకు అప్పగించారు. బెంగుళూరుకు చెందిన శ్రీనివాస్, రేఖలతో పాటు నాలుగేళ్ల కొడుకు మాన్విక్‌తో మంత్రాలయంకు వచ్చారు. గురువారం శ్రీమఠం ప్రాంగణంలో మాన్విక్ తప్పిపో యాడు. వెంటనే తల్లిదండ్రులు మంత్రాలయం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. స్పందించిన పోలీసులు తల్లిదండ్రులు ఇచ్చిన ఫొటో ఆధారంగా మార్వాడీ షాపు దగ్గర ఏడుస్తున్న బాలుడిని గుర్తించారు. పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి తల్లిదండ్రులకు బాలుడిని ఎస్ఐ శివాంజల్, కానిస్టేబుల్ రామకృష్ణలు అప్పగించారు. దీంతో తల్లిదండ్రులు, భక్తులు పోలీసులను అభినందించారు.

మావోయిస్టులతో చర్చలు జరపాలి


- అరుణోదయ తెలుగు రాష్ట్రాల గౌరవాధ్యక్షురాలు విమలక్క


పాటల సీడీని ఆవిష్కరిస్తున్న విమలక్క

కర్నూలు న్యూసిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తెలుగు రాష్ట్రాల గౌరవాధ్యక్షురాలు విమలక్క అన్నారు. గురువారం స్థానిక ప్రగతిశీల మహిళా సంఘం కార్యాలయం వద్ద నీలం రామచంద్రయ్య, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ పాటల సీడీని ఆమె ఆవిష్కరించారు. భూమి కోసం, భుక్తి కోసం, ఈ దేశ విముక్తి కోసం పోరాడి నేలరాలిన ఎందరో అమరవీరులకు విప్లవ జోహార్లు అర్పిస్తూ నవంబర్ మాసమంతా ఊరూరా సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. దేశంలోని ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడానికే ఆపరేషన్ కగార్ పేరుతో అడవులపై, ఆదివాసులపై మిలటరీ, పారా మిలిటరీ, డీఆర్జీ బలగాలతో అడవులను ముట్టడించి మావోయిస్టులను పొట్టన పెట్టుకుంటున్నారని విమర్శించారు. తక్షణమే ఆపరేషన్‌ను నిలిపివేసి విప్లవకారులతో శాంతి చర్చలు జరపాలని ఆమె కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కరీంబాషా, డీటీఎఫ్ నాయకుడు రత్నం ఏసేబు, కేఎన్‌పీఎస్ నాయకుడు సుబ్బారాయుడు, విప్లవ కళాకారుడు పోతన, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ నాయకుడు శేషఫణి పాల్గొన్నారు.

గ్యాస్ లీకై ఇంట్లో మంటలు

- రూ.15లక్షల ఆస్తి నష్టం


కాలిపోయిన బీరువా

వెల్దుర్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ లీకై ఇంట్లో మంటలు చెలరేగాయి. దీంతో ఆస్తి నష్టం సంభవించింది. ఈ ఘటన మండలంలోని గోవర్ధనగిరి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన గంటె రామాంజనేయులు బెస్తవీధిలో కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. గురువారం తల్లి, భార్య పొలం పనులకు, ఇద్దరు పిల్లలు స్కూల్‌కు వెళ్లారు. ఉదయం 10 గంటల ప్రాంతంలో పెద్ద పేలుడు శబ్దం రావడంతో గ్రామస్థులంతాతా భయందోళనకు గురయ్యారు. రామాంజనేయులు ఇంట్లో మంటలు వస్తుండడంతో అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. డోన్ అగ్ని మాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఇంట్లో ఉన్న టీవీ, ఫ్రిజ్, బట్టలు, ధాన్యం, బీరువాలో ఉన్న నగదు రూ.1లక్ష, 6తులాల బంగారు, 15తులాల వెండి ఆభరణాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఇంటి పైకప్పు, తలుపులు, వరండాలో ఉన్న కడ్డీల వాకిలి, మెట్లు దెబ్బతిన్నాయి. గ్యాస్ లీకు కావడం వల్లె ప్రమాదం సంభవించిందని అగ్నిమాపక శాఖ అధికారులు ధ్రువీకరించారు. రూ.15లక్షల మేర ఆస్తినష్టం సంభవించినట్లు బాధిత కుటుంబం పేర్కొంది. కట్టుబట్టల తప్ప ఏమి మిగలలేదని కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. గ్యాస్ లీకైన సమయంలో ఇంటిలో కుటుంబ సభ్యులెవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది.

ప్రతి ఎకరాకు సాగునీరు ఇవ్వాలి

- సబ్ డివిజన్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం
- ఎల్లెల్సీ కెనాల్‌ను పరిశీలించిన రైతులు


అక్రమ మోటార్లను చూపుతున్న ఆయకట్టు రైతులు

కోడుమూరు రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో చివరి ఆయకట్టు దాకా ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలని రైతులు డిమాండ్ చేశారు. గురువారం పులకుర్తి, గూడూరుకు చెందిన చివరి ఆయకట్టు రైతులు ఎల్లెల్సీ కెనాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు నాగిరెడ్డి, విజయభాస్కరరెడ్డి, తిమోతి మాట్లాడుతూ కోడుమూరు సెక్షన్‌లో చివరి ఆయకట్టుకు సుమారు 25ఏళ్లకు పైగా సాగునీరు అందడం లేదని ఆరోపించారు. వర్షాధార పంటలపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. ఈఏడాది అధిక వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయని, రైతులు తీవ్రనష్టాలపాలయ్యారని విచారం వ్యక్తం చేశారు. అడుగడుగునా నానాయకట్టుదారులు మోటార్లు వేసుకుని సాగునీరు వాడుకుంటున్నారని తెలిపారు. దాదాపు 2 వేల ఎకరాలు వరకు నానాయకట్టు సాగువుతోందని రైతులు అన్నారు. అధికారులు మామూళ్ల మత్తులో పడి చివరి ఆయకట్టును పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రబీ సీజన్‌లో చివరి ఆయకట్టు దాకా ప్రతి ఎకరాకు సాగునీరు పారించాలని డిమాండ్ చేశారు. సాగునీరు ఇవ్వని పక్షంలో రైతులను సమీకరించి సబ్‌డివిజన్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రామకోటిరెడ్డి, లింగన్న, కర్ల పాల్గొన్నారు.

చనిపోతూ ఇద్దరికి చూపు ప్రదానం

కర్నూలు హస్పిటల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలు వెంకటరమణ కాలనీ రోడ్ నెంబర్-5లో ఉన్న సుజాతమ్మ (65) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. సుజాతమ్మ మరణవార్త విషయం తెలిసిన వెంటనే మానవతా స్వచ్ఛంద సంస్థ సభ్యులు గూడూరు యుగంధర్ శెట్టి, శోభన్‌బాబు ఇంటికి వెళ్లి పరామర్శించి నేత్రదానంపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. చనిపోయిన ఆమె వల్ల ఇద్దరికి చూపు వస్తుందన్న ఉద్దేశంతో నేత్రదానం చేయడానికి కుటుంబ సభ్యులు అంగీకరించారు. ఈవిషయాన్ని మానవతా సంస్థ రెడ్‌క్రాస్ సంస్థ కౌన్సిలర్ ప్రదీప్‌కు తెలియజేశారు. ఆయన వచ్చి రెండు నేత్రాలను సేకరించారు. నేత్రదానం చేయా లనుకున్న వారు మానవతా సంస్థ సెల్‌నంబర్లు 9000090920, 9398110551ను సంప్రదించాలని కోరారు.


సుజాతమ్మ (ఫైల్)

రోగులకు కొత్త సప్త వర్ణ దుప్పట్లు


కొత్త దుప్పట్లను విడుదల చేస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు హస్పిటల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ధన్వంతరి హాలులో లియోటిక్ ప్రొఫెసర్ ఆధ్వర్యంలో నూతన స్వచ్ఛ సప్తవర్ణ దుప్పట్లను హస్పిటల్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ సప్తవర్ణ దుప్పట్లు పంపిణీని 2017 మే 24న ప్రారంభించారని, ఇప్పటి వరకు ప్రతి 60 ఉతుకుల తర్వాత మారుస్తామన్నారు. అదే విధానంలో 60 ఉతుకులు అయినందున గురువారం నుంచి నూతన స్వచ్ఛ సప్తవర్ణ దుప్పట్లను పంపిణీ చేశామన్నారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాల్లో ఉండే రోగులకు ప్రతి రోజు కలర్ దుప్పట్లు, ఐడెంటిఫికేషన్ చేసి ప్రతి రోజు ఒక బెడ్‌షీట్ ఉండేటట్లు చూసుకోవాలని నర్సింగ్ సూపరింటెండెంట్ ఎస్‌పీ సావిత్రిబాయిని ఆదేశించారు.హస్పిటల్ సీఎస్ ఆర్ఎంవో డా.పద్మజ, ఆర్ఎంవో డా.వెంకటరమణ, అడ్మినిస్ట్రేటర్ సింధూ సుబ్రహ్మణ్యం, లియోటిక్ మేనేజర్ ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

కష్టం.. కన్నీళ్లు!


అధిక వర్షాల వల్ల తడిసిన మొక్కజొన్న ధాన్యం

ఆత్మకూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల ఆత్మకూరు ప్రాంతంలో అన్నదాతలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇటీవల కాలంలో ఎన్నడూ లేనివిధంగా భారీ వర్షాలు కురియడంతో పంట పొలాల్లో వర్షపునీరు నిలిచిపోవడంతో చేతికొచ్చిన పంటలన్నీ దెబ్బతిన్నాయి. దిగుబడులు వర్షానికి తడిసి నాసిరకంగా తయారయ్యాయి. అక్టోబరు 30 నుంచి నవంబరు 3వ తేదీ వరకు రెవెన్యూ, వ్యవసాయాధికారులు యుద్ధప్రాతిపదికన పరిశీలన చేపట్టి పంట నష్ట పరిహారం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ లెక్కన ఆత్మకూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో 9409 మంది రైతులకు చెందిన 4108 హెక్టార్లలో పంటనష్టం వాటిల్లినట్లు గుర్తించారు.

- అన్నదాతల్లో ఆవేదన మిగిల్చిన మొంథా
- ఆత్మకూరు డివిజన్‌లో 4108 హెక్టార్లలో పంట నష్టం
- 9409 బాధిత రైతులతో జాబితా సిద్ధం చేసిన వ్యవసాయాధికారులు
- పంట నష్టపరిహారం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు


దెబ్బతిన్న మొక్కజొన్న కంకులు

వెలుగోడు మండలంలో 572 మంది రైతులకు సంబంధించి 195 హెక్టార్లు, పాములపాడులో 1190 రైతులకు సంబంధించి 715 హెక్టార్లు, కొత్తపల్లిలో 2620 మంది రైతులకు సంబంధించి 962 హెక్టార్లు, ఆత్మకూరు మండలంలో అత్యధికంగా 5027 మంది రైతులకు సంబంధించి 2234 హెక్టార్ల పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. ఈ నివేదికలన్నింటిని జిల్లా అధికారులకు ప్రతిపాదించడం జరిగింది.

దెబ్బతిన్న ప్రధాన పంటలు ఇవే

ఆత్మకూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లో మొంథా తుఫాన్‌తో మొత్తం 4108 హెక్టార్లలో పంటనష్టం జరగ్గా అందులో ప్రధానంగా మొక్కజొన్న 3038 హెక్టార్లు, 946 హెక్టార్లు, సోయాబీన్ 50హెక్టార్లు, పత్తి 70.61హెక్టార్లు దెబ్బతిన్నట్లు గుర్తించారు. పత్తి, వరి పంటలకు హెక్టారుకు రూ.25వేలు, మొక్కజొన్న, సోయాబీన్‌కు రూ.15వేలు పరిహారం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. అయితే ఇచ్చే ఈ పరిహారం ఏమాత్రం సరిపోవని రైతులు వాపోతున్నారు. అదేక్రమంలో ప్రభుత్వమే సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి దెబ్బతిన్న, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

నష్ట పరిహార జాబితాను సిద్ధం చేశాం

మొంథా తుఫాన్ ధాటికి ఆత్మకూరు వ్యవసాయ డివిజన్ పరిధిలో ఈ-క్రాప్ నమోదు చేయబడి దెబ్బతిన్న పంటలన్ని పరిశీలించి పంటనష్ట పరిహార జాబితాను సిద్ధం చేశాం. త్వరలోనే పంటలు నష్టపోయిన రైతుల వివరాలను అన్ని గ్రామాల్లో ప్రదర్శిస్తాం. అదేక్రమంలో ప్రభుత్వం ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటాం.

● హేమలత, ఏడీఏ, ఆత్మకూరు


దెబ్బతిన్న మొక్కజొన్న పైరు


దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి


మాట్లాడుతున్న నాయకులు

నందికొట్కూరు రూరల్, నవంబర్6.(ఆంధ్రజ్యోతి) : మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష్యులు నాగేశ్వరారావు డిమాండ్ చేశారు. గురువారం నందికొట్కూరు మండలంలోని బిజినవేముల గ్రామం కల్లాలో రైతులు ఆరబోసిన మొక్కజొన్నలను రైతు సంఘం ఆధ్వర్యంలో నాయకులు పరిశీలించారు. వారు మాట్లాడుతూ క్వింటం రూ. 2400లతో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకులు ఉస్మాన్, బిజినవేముల రైతులు రాజు, రాంబాబు, మద్దిలేటి, సోడబాషా ఉన్నారు.

ఆత్మకూరు: ఆత్మకూరు మండలంలో ఇటీవల సంభవించిన మొంథా తుఫాన్ ధాటికి పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం నాయకులు వెంకటేశ్వర్లు, రణధీర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల మీట్‌లో ఎంపీపీ తిరుపాలమ్మ, ఎంపీడీవో నాగేంద్రుడులకు వినతిపత్రాలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దెబ్బతిన్న పంటలకు వెంటనే పరిహారం మంజూరు చేయాలని అన్నారు. కౌలు రైతులను ఆదుకోవాలని అన్నారు. అలాగే నల్లకాల్వ నుంచి కొత్తరామాపురం వెళ్లే రహదారిపై వంతెన నిర్మాణం చేపట్టాలని అన్నారు.

కూలుతున్న మట్టి మిద్దెలు

కొత్తపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో గత పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని ఆయా గ్రామాల్లో 24 మట్టిమిద్దెలు కూలినట్లు తహసీల్దార్ ఉమారాణి తెలిపారు. ఆమె తెలిపిన వివరాల మేరకు కొత్తపల్లిలో 8, గువ్వలకుంట్లలో 8, గోకవరంలో 3, గుమ్మడాపురంలో 1, కొక్కెరంచలో 1, ఎదురుపాడులో ఒకటి, ఎర్రమటంలో 1, వీరాపురంలో ఒక మట్టిమిద్దె కూలినట్లు ఆయన తెలిపారు. నూతన గృహాలు నిర్మించుకునేందుకు కలెక్టర్‌కు తెలియజేస్తామని ఆమె వెల్లడించారు.

హాస్టళ్ల తనిఖీ


పాములపాడులో ఎస్సీ హాస్టల్ ను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి

పాములపాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పాములపాడులోని హాస్టల్స్‌ను మండల ప్రత్యేక అధికారి రాజ్ ఆకస్మిక తనిఖీ చేశారు. గురువారం ఎంపీడీవో చంద్రశేఖర్‌తో కలిసి స్థానిక ఎస్సీ బాలికల వసతిగృహం, మోడల్‌స్కూల్, కస్తూర్బా పాఠశాలలోని బాలికల వసతిగృహాలను పరిశీలించారు. మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా, వంటలు రుచిగా ఉన్నాయా అంటూ విద్యార్థినులను ఆరా తీశారు

9న సభను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్

ఆత్మకూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో 9న జరిగే సోవియట్ విప్లవ వార్షికోత్సవ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు రణధీర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ వార్షికోత్సవ సభకు మేధావులు, లౌకికవాదులు, కార్మికులు, కర్షకులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు రామ్‌నాయక్, సురేంద్ర, వీరన్న, గణపతి తదితరులు ఉన్నారు.

● బేతంచెర్ల పట్టణంలో 17, 18 తేదీల్లో జరిగే సీఐటీయూ 3వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, అధ్యక్షులు సద్దాంలు తెలిపారు. గురువారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికులు, కార్మిక సంఘాల నేతలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు రణధీర్, మంజుల, సురేంద్ర, సుబ్బయ్య, బాషా, శివకుమార్ తదితరులు ఉన్నారు.

విధుల్లో అలసత్వం వీడాలి: ఆర్డీవో


మాట్లాడుతున్న ఆర్డీవో నాగజ్యోతి

బండి ఆత్మకూరు నవంబరు6(ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు విధుల పట్ల అలసత్వం వీడాలని ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి హెచ్చరించారు. గురువారం సాయంత్రం తహసీల్దార్ పద్మావతమ్మతో కలిసి వీఆర్వోలు, సర్వేయర్లతో రివ్యూ చేశారు. ఆర్డీవో మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. ప్రస్తుతం జరిగే భూముల సర్వేలో ఎలాంటి తప్పులు రాకూడదన్నారు. విద్యార్థులకు కావాల్సిన సర్టిఫికెట్ల జారీలో ఎలాంటి జాప్యం జరగకూడదని తెలిపారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాసులు, మండల సర్వేయర్ నాగప్రసాద్, నరసింహులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ


క్రీడాకారులకు దుస్తులను పంపిణీ చేస్తున్న దృశ్యం

పాణ్యం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి క్రీడాకారుల శిక్షణ పూర్తి చేసుకున్న జట్టుకు క్రీడాదుస్తులు పంపిణీ చేసినట్లు ఎంఈఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం నంద్యాల జిల్లా బాలికల కబడ్డీ క్రీడాకారులకు 14 మందికి రూ. 10 వేల విలువ చేసే క్రీడా దుస్తులను నంద్యాల రోటరీ ఇన్నర్‌వీల్ విశ్రాంత ప్రెసిడెంట్ చెన్నమరాజ వసుంధరాదేవి అందజేశారు. ఈనెల 7 వతేదీనుంచి 9 వతేదీ వరకు కడప జిల్లా పులివెందులలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలు క్రీడాకారులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా కమిటీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, విజయానికేతన్ పాఠశాల ఏఓ రాజశేఖర్ పాల్గొన్నారు.

నాటక రంగంలో విశేష కృషికి పురస్కారం


రంగస్థల సంగీత దర్శకుడు రత్నకుమార్‌కు పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

నంద్యాల కల్చరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నాటక,సంగీత, నృత్య, జానపద కళా రంగంలో విశేషకృషి చేసిన సేవలకు గుర్తింపుగా కర్నూలు ఉత్సవ్25 కార్యక్రమంలో కళాకారులకు నిర్వాహకులు పురస్కారాలను అందజేశారు. ఆంధ్రప్రదేశ్ సాంస్కృతికశాఖ, నాటక అకాడమీ సహకారంతో కర్నూలులోని టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న కర్నూలు ఉత్సవ్25 కార్యక్రమంలో ప్రముఖ రంగస్థల సంగీత దర్శకులు పిఎస్ రత్నకుమార్‌కు పద్యనాటక సేవారంగ పురస్కారం బుధవారం అందజేశారు. నంద్యాల జిల్లాకు చెందిన పలువురు కళాకారులు అభినందనలు తెలిపారు.

రోగులకు సత్వరమే వైద్య చికిత్సలు అందించాలి


అధికారులతో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి వెంకటరమణ

మహానంది, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రోగాల బారిన పడి చికిత్స కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే వారికి సత్వరమే సిబ్బంది వైద్య చికిత్సలు అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకట రమణ తెలిపారు. గురువారం మహానంది మండలం ఎం. తిమ్మాపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరుతో పాటు పరిసరాలను పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమం లో వైద్యాధికార్లు భగవాన్ దాస్, వేణు కార్తీకేయ, ఎంపీహెచ్ఈఓ ఉసేనిరెడ్డి పీహెచ్ఎన్ అమీనాబీ పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీవో నాగేంద్రుడు

ఆత్మకూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో గురువారం ఎంపీపీ తిరుపాలమ్మ అధ్యక్షతన జరిగిన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. సమావేశానికి ఆర్డీసీ, పోలీసు, అటవీ, ఆర్అండ్‌బీ, ఎక్సైజ్ తదితర శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. అదేక్రమంలో పలుశాఖలకు సంబంధించి ఉన్నతాధికారులకు బదులు వారి స్థానంలో కిందిస్థాయి సిబ్బందికి సమావేశానికి హాజరయ్యారు. దీంతో హాజరైన వారు తమ శాఖకు సంబంధించిన ప్రగతి నివేదికలను చదివి వినిపించి మమ అనిపించారు. అదేవిధంగా ఆయా గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సైతం పూర్తిస్థాయిలో మండల మీట్‌కు హాజరుకాలేదు. మహిళా ప్రజాప్రతినిధులకు బదులు వారి భర్తలు దర్జాగా సమావేశానికి హాజరయ్యారు. కాగా డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు మాట్లాడుతూ.. ఇటీవల ఆత్మకూరు మండలంలో సంభవించిన తుఫాన్ వల్ల నష్టపోయిన పంటలకు సంబంధించి నష్టపరిహార జాబితాను తయారు చేసి ప్రభుత్వానికి నివేదించామన్నారు. ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఎంపీడీవో నాగేంద్రుడు మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి మండలాభివృద్ధికి తోడ్పాటునందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కోఆప్షన్ సభ్యులు మౌలాలి మాట్లాడుతూ.. వడ్లరామాపురంలో ఇటీవల సంభవించిన వర్షాలతో పాత జెడ్పీ పాఠశాలలో నీరు చేరి విద్యార్థులు అవస్థలు పడ్డారని, కొత్త నిర్మించిన పాఠశాలలో తరగతులు ప్రారంభించాలని కోరారు. సమావేశంలో ఏడీఏ హేమలత, హౌసింగ్ ఏఈ ఉమామహేశ్వరరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పక్కిరయ్య, పీఆర్ ఏఈ వెంకటరమణ, ఉద్యానశాఖ అధికారి చందన ఉన్నారు.

1500 ఎకరాల్లో వరి పంట నష్టం

మహానంది, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల మహానంది మండలంలో 15 వందల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి గురువారం తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో వరి పంట దెబ్బతినడంతో సిబ్బంది సహాయంతో క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. నష్ట పరిహారం కోసం నివేదికలను ఉన్నతస్థాయి అధికారులకు పంపించామని తెలిపారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకొని నష్టపరిహారం అందచేస్తుందని ఏవో పేర్కొన్నారు.

దోమతెరల పంపిణీ


దోమతెరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

మహానంది, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం గాజులపల్లి ఆర్ ఎస్‌లోని చెంచుగూడెం గిరిజనులకు మండల బీసీ సెల్ నాయకుడు పాశం శ్రీనివాసులు 200 దోమతెరలను గురువారం ఉచితంగా పంపిణీ చేశారు. గత కొన్ని రోజులుగా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాల వల్ల దోమలు అధికంగా వ్యాపించాయని, దీని కోసం గిరిజనులు దోమల బారిన పడకుండా ఉండేందుకు దోమతెరలను పంపిణీ చేసినట్లు దాత శ్రీనివాసులు తెలిపారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు పాశం రమణ, శేషులు పాల్గొన్నారు.

చితికిలబడి

- శిథిలావస్థలో కపిలేశ్వరం పాఠశాల
- పెచ్చులూడుతున్న పైనం
- రేకుల షెడ్డులోనే విద్యాబోధన
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు


శిథిలావస్థకు చేరిన కపిలేశ్వరం పాఠశాల


రేకుల షెడ్డులో పాఠాలు బోధన

కొత్తపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఏళ్ల కిందట నిర్మించిన భవనాలు కావడంతో పైకప్పులు ఊడుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళన చెందుతున్నారు. కొత్తపల్లి మండలంలోని శ్రీశైలం రిజర్వాయర్ పక్కన నల్లమల అటవీ ప్రాంతంలోని కపిలేశ్వరంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారుల నిర్లక్ష్యంతో నాడు-నేడు కింద ఎంపిక చేయడంలో అధికారులు విఫలమయ్యారు. ప్రస్తుతం ఉన్న పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడంతో ఇక్కడి మండల విద్యాధికారులు సమీపంలో ఉన్న మత్స్య శాఖ కేంద్రంలో ఖాళీగా ఉన్న ఓ రేకుల షెడ్డునే బడిగా మార్చి విద్యార్థులకు విద్యను అందిస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు, ఈదురుగాలులకు, వర్షాల తుంపర్లకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన భవనాన్ని నిర్మించాలని విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

● **నూతన భవనం నిర్మించాలి**



కపిలేశ్వరం పాఠశాల శిథిలావస్థకు గురై ఆరేళ్లయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు వేలకు వేలు జీతం ఇస్తుంది గానీ, ఇలాంటి మారుమూల ప్రాంతాల్లోని పాఠశాలను పట్టించుకోకపోవడం గమనార్హం. విద్యార్థులు రేకులషెడ్డులోనే చలికి, వర్షానికి వణుకుతూ జ్వరంతో బాధపడుతున్నారు.

- పరమేశ్వరగౌడు, కపిలేశ్వరం

వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత


గగ్గటూరు ప్రాథమికోన్నత పాఠశాలలో బోధిస్తున్న ఉపాధ్యాయిని

పాణ్యం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. మండలంలో 40 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 2995 మంది విద్యార్థులు చదువుతుండగా 192 మంది ఉపాధ్యాయులు తరగతులు బోధిస్తున్నారు. గగ్గటూరు ప్రాథమికోన్నత పాఠశాలలో 21 మంది విద్యార్థులుండగా ఒక విద్యార్థి పాఠశాల నుంచి బదిలీ కావడంతో ఇద్దరు ఉన్న ఉపాధ్యాయుల్లో ఒకరిని తగ్గించారు. మళ్లీ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 27కు చేరడంతో ఉపాధ్యాయుడ్ని ఏర్పాటు చేయడంలో జాప్యం ఏర్పడి తరగతులు ఒకే ఉపాధ్యాయురాలు నిర్వహించుకోవాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. సుబ్బరాయుని కొత్తూరు ప్రాథమిక పాఠశాలలో గతేడాది 25 మంది విద్యార్థులుండగా ఇద్దరు ఉపాధ్యాయులు కొనసాగేవారు. ప్రస్తుతం 17 మంది మాత్రమే ఉన్నా ఇద్దరు ఉపాధ్యాయులు కొనసాగుతున్నారు. అలాగే ఇందిరానగర్‌లో ఇందిరానగర్‌లో 74 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. అనుపూరులో ఏడు మందికి ఒకరు, గోనవరం ఉర్దూ పాఠశాలలో ముగ్గురు విద్యార్థులకు ఒకరు, సాబ్జహాన్ కొట్టాల ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో ఐదు మందికి ఒక ఉపాధ్యాయుడు విద్య బోధిస్తున్నారు. కందికాయపల్లిలో 39 మందికి ఒకే ఉపాధ్యాయుడు కొనసాగుతున్నాడు. కాగా గగ్గటూరు. కందికాయపల్లి పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలని ఆయా గ్రామ ప్రజలు కోరుతున్నారు. అదనంగా ఉన్న ఉపాధ్యాయులను కొరత ఉన్న పాఠశాలలకు బదిలీ చేయాలని కోరుతున్నారు.

తీరనున్న రైతుల కష్టాలు


కోనేటమ్మపల్లె నుంచి అలంపూర్‌కు వెళ్లే రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

నందికొట్కూరు రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కోనేటమ్మపల్లె నుంచి అలంపూర్ వైపుగా వెళ్లే రహదారికి ఎట్టకేలకు ఎమ్మెల్యే జయసూర్య చొరవతో మోక్షం లభించింది. ఈ రోడ్డు వల్ల కోనేటమ్మ పల్లె గ్రామ రైతులు అలాగే కోళ్ల భావాపురం, వడ్డెమాను గ్రామాల రైతులు అలంపూర్ వైపుగా ఉన్న పొలాలకు, ఇతర గ్రామాలకు వెళ్లేందుకు రైతులు, ప్రజలు ఇబ్బంది పడేవారు. డీఎంఎఫ్ నిధుల నుంచి రూ. కోటి 90 లక్షలను మంజూరు చేయించినట్లు పీఐయూ డీఈ ఈరన్న తెలిపారు. గురువారం అధికారులు రోడ్డును పరిశీలించారు. త్వరలోనే టెండర్లు పిలిచి రోడ్డు పనులు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దామోదరరెడ్డి, జేఈలు శ్రీదేవీ, వెంకటరమణ, వహీద్ సిబ్బంది పాల్గొన్నారు.

జల్‌జీవన్ మిషన్‌తో సమస్య పరిష్కారం

ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి


పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

వెలుగోడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం నియోజకవర్గంలో ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడకుండా చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న జలజీవన్ మిషన్ పనులు వేగవంతంగా సాగుతున్నాయని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. గురువారం వెలుగోడులోని జమ్మినగర్‌లో రూ. 7.02 కోట్ల నిధులతో చేపట్టనున్న అబివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ప్రత్యేక శ్రద్ధతో గ్రామాల్లోని ప్రతి ఇంటికి శుద్ధమైన తాగునీరందించేందుకు పట్టణాల నుంచి గ్రామీణ ప్రాంతాల వరకు అండర్‌గ్రౌండ్ పైప్‌లైన్‌లు, నీటి ట్యాంకులు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మొంథా తుఫాన్ కారణంగా పంటనష్ట పోయిన రైతులు స్థానిక వ్యవసాయ కార్యాలయంలో పంటనష్టం వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల అధికారులు ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు టీడీపీ నాయకులు శంకర్‌రెడ్డి, అబ్దుల్‌కలాం, కలిముల్లా, మెడికల్ రాము, డాక్టర్ జాఫీర్, శాలుబాషా, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దరఖాస్తులు చేసుకోండి

పాములపాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అర్హత కల్గిన దివ్యాంగులు మూడు చక్రాల మోటారు వాహనంనకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు.. గురువారం ఆయన మాట్లాడుతూ 18 నుంచి 45 సంలు వయస్సు కల్గి ఉండాలని, 70 శాతం వికలాంగత్వం కల్గి ఉండాలని, 3 లక్షల వార్షిక ఆదాయం మించరాదని, డ్రైవింగు లైసెన్స్ కల్గి ఉండాలని తెలిపారు. వికలాంగత్వం ధృవీకరణ పత్రం, ఆధార్, కులధృవీకరణ పత్రం, పాస్‌పోటో జతపరచి ఈనెల 25నాటికి దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

ప్రత్యేక పూజలు

నంద్యాల కల్చరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలో కార్తీకమాసం సందర్భంగా గురువారం పలు శైవ క్షేత్రాలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఆకాశదీపాలు భక్తులు వెలిగించారు. పట్టణంలోని ప్రథమనందీశ్వరాలయం, అమ్మస్ఫటికలింగేశ్వరాలయం, నాగనందీశ్వరాలయం, సోమనందీశ్వరాలయం, నాగనంది ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోండి

ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కోరారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఆమె పోలీసు, మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి, ఎంపీడీవో నూర్జహాన్, ఆర్డీసీ, పంచాయతీ రాజ్ , పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ: ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని పలు మండలాల బాధితులకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గురువారం పంపిణీ చేశారు. తాలుకాలోని వివిధ మండలాలలోని 79 మంది బాధిత కుటుంబాలకు రూ 54,14,611 చెక్కులను అందజేశారు.

రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి: సీఐ



ఆర్టీసీ డ్రైవర్లకు సూచనలిస్తున్న సీఐ ఇంతియాజ్ బాషా

డోన్ టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డ్రైవర్లు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ ఇంతియాజ్ బాషా అన్నారు. గురువారం డోన్ డిపో గ్యారేజీలో ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, డోన్ డిపో మేనేజర్ ఎం.శశిభూషణంలు హాజరై రోడ్డు ప్రమాదాల నివారణపై ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని, డ్రైవింగ్ చేసే సమయంలో ప్రజలకు వారి గమ్యస్థానాలకు క్షేమంగా చేరేలా చూడాలని సూచించారు. అలాగే సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

పందుల తరలింపును అడ్డుకున్న యజమానులు



అధికారులతో వాగ్వాదం చేస్తున్న పందుల యజమానులు

కొలిమిగుండ్ల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మలపెంట గ్రామంలో పందుల తరలింపునకు వెళ్లిన అధికారులను యజమానులు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. గురువారం గ్రామస్థుల వినతి మేరకు మండల డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళి గౌడ్, పంచాయతీ కార్యదర్శి ఉదయ్, పోలీసు సిబ్బంది సహాయంతో పందులను ఇతర ప్రాంతాలకు తరలించడానికి తుమ్మలపెంట గ్రామానికి చేరుకున్నారు. పందుల యజమానులు అధికారులను పందులు తరలించరాదంటూ అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. పందులను తామే బయటికి తరలిస్తామని, అందుకు తాము అడిగిన సమయం ఇవ్వాలని కోరారు. నెలరోజుల్లో పందులను తరలించకుంటే తిరిగి తామే వాటిని తరలిస్తామని అధికారులు చెప్పారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కేజీబీవీ విద్యార్థినులు

బేతంచెర్ల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక కేజీబీవీ గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థినులు వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబీదాభేగం గురువారం తెలిపారు. నంద్యాల పట్టణంలో జరిగిన యువజనోత్సవాల్లో నిర్వహించిన వివిధ పోటీల్లో బేతంచెర్ల కేజీబీతు జూనియర్ కళాశాల విద్యార్థినులు జానపద, నృత్య పోటీల్లో కరిష్మా బృందం జిల్లా మొదటి స్థానాన్ని కైవసం చేసుకుందన్నారు. వ్యాసరచన పోటీల్లో కవిత, విక్టోరియాలు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ అభినందించారు.

పాఠశాల తనిఖీ

రుద్రవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరినగరం ప్రాథమిక పాఠశాలను ప్రణాళిక అధికారి కిశోర్‌రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. తరగతి గదిలో సిమెంటు బస్తాలు, ఇనుప కడ్డీలు, కర్రలు ఉన్నాయని, వాటిని అక్కడి నుంచి తొలగించాలని హెచ్‌ఎం మెరీకి సూచించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ తొలగించడానికి మనుషులు రావడంలేదని వివరించారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలం



మాట్లాడుతున్న వైద్యాధికారి బాబు

రుద్రవరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతో విద్యార్థుల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని వైద్యాధికారి బాబు అన్నారు. గురువారం మండలంలోని నరసాపురం ఉన్నత పాఠశాలలో రాష్ట్రీయబాల స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి బాబు మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడంతో రక్తహీనతకు చెక్ పెట్టవచ్చన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజరు భూలక్ష్మి, హెచ్‌ఎం రాజ్యలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ నిరీక్షణ పాల్గొన్నారు.

12న మండల సర్వసభ్య సమావేశం

డోన్ రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈనెల 12న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వంకటేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశానికి ప్రజా ప్రతినిధులు, మండలస్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

నెరవేరనున్న కల

శరవేగంగా షాదీఖానా నిర్మాణ పనులు

బనగానపల్లె, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముస్లింల కల నెరవేరనుంది. రూ.కోటితో షాదీఖానా నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఎన్నికల హామీలో భాగంగా షాదీఖానా నిర్మాణం పూర్తి చేసి ముస్లింలకు అంకితమిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో షాదీఖానా పనులు మొదలయ్యాయి. ఇప్పటికి సుమారు 70 శాతం పనులు పూర్తయ్యాయి.

ఏళ్ల తరబడి అసంపూర్తిగా షాదీఖానా

గత 25ఏళ్ల క్రితం పాతబస్టాండ్ సమీపంలో అప్పట్లో షాదీఖానా నిర్మాణా నికి రూ.40లక్షలు వెచ్చించి ఏర్పాటు చేశారు. కాని కనీస సౌకర్యాలు లేకపోవడంతో షాదీఖానా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి బనగానపల్లె ఎమ్మెల్యేగా ఉన్న బీసీ జనార్దన్‌రెడ్డి షాదీఖానా నిర్మాణ పనులు ప్రారంభించారు. షాదీ ఖానా నిర్మాణానికి అప్పట్లో బీసీ జనార్దన్‌రెడ్డి రూ.50 లక్షలు నిధులు వక్ఫ్‌బోర్డు నుంచి విడుదల చేయించారు. అలాగే రూ.30 లక్షలు సొంత నిధులను కూడా విరాళంగా ఇచ్చారు. అయితే నిర్మా



పూర్తయిన ప్రహరీ నిర్మాణం



పూర్తి కావచ్చిన బనగానపల్లె షాదీఖానా భవనం

ణం ప్రారంభం కాగానే అప్పట్లో ఎన్నికలు రావడంతో షాదీఖానా నిర్మాణం పూర్తిగా నిలిపోయింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో షాదీఖానా పనులు పూర్తిగా ఆగిపోయాయి.

వైసీపీ హయాంలో..

2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత షాదీఖానా నిర్మాణం పనులు ఒక్క అడుగుకు కూడా ముందుకు సాగలేదు. వైసీపీ ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో షాదీఖానా నిర్మాణ పనులు ఆగిపోయాయి. ఆ స్థలంలో పిచ్చిమొక్కలు, ముళ్లకంపలు మొలిశాయి.

కూటమి ప్రభుత్వం రావడంతో..

కూటమి ప్రభుత్వం అధికారం లోకి రావడం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి రూ.కోటి నిధులు మంజూరు చేయించి పనులు తిరిగి పునఃప్రారంభించారు. ప్రస్తుతం 70 శాతం పనులు పూర్తయ్యాయి. షాదీఖానా ప్రహరీ నిర్మాణ పనులు కూడా పూర్తయ్యాయి.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు, పాల్గొన్న దంపతులు

చాగలమర్రి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని భైరవీశ్వర ఆలయంలో కార్తీకపౌర్ణమి సందర్భంగా గురువారం తెల్లవారుజామున వేద పండితుల ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం కమణీయంగా సాగింది. వేద పండితుల ఆధ్వర్యంలో దంపతులచే కల్యాణం నిర్వహించారు. 208 మంది మహిళలతో సామూహిక దీపోత్సవం నిర్వహించారు. దీపాలు నెత్తిన పెట్టుకొని మహిళలు సమీపంలోని టీజీపీ జలాశయంలో దీపాలను నీటిలో వదిలారు. అనంతరం గణపతి, చండీ, శాంతి, పూర్ణాహుతి హోమాలు నిర్వహించారు.

శివపార్వతుల పల్లకీ ఉత్సవం: చాగలమర్రి గ్రామంలోని పాత శివాలయం, భీమలింగేశ్వర ఆలయాల్లో కార్తీకమాసం సందర్భంగా గురువారం శివపార్వతుల పల్లకీ ఉత్సవం నిర్వహించారు. మహిళలు సామూహికంగా విష్ణుసహస్రపారాయణం చేశారు. వేద పండితుల ఆధ్వర్యంలో శివపార్వతులకు అభిషేకాలు చేశారు. ఆలయ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

అవుకు ఎంపీడీవోగా రామక్రిష్ణవేణి

అవుకు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అవుకు ఎంపీడీవోగా రామక్రిష్ణవేణి గురువారం బాధ్యతలు చేపట్టారు. బండిఆత్మకూరు ఎంపీడీవో కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న రామక్రిష్ణవేణికి ఉన్నతాధికారులు ఎంపీడీవోగా పదోన్నతి కల్పించి అవుకు ఎంపీడీవోగా బదిలీ చేశారు. ఎంపీడీవో రామక్రిష్ణవేణిని డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు, ఏవో శ్రీరాములు, అవుకు పంచాయతీ ఈవో హరిప్రసాద్‌లు కలిసి అభినందనలు తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం



పోటీలను ప్రారంభిస్తున్న బనగానపల్లె మార్కెట్ యార్డు చైర్మన్ మల్లికార్జునరెడ్డి

కోవెలకుంట్ల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని బనగానపల్లె మార్కెట్‌యార్డు చైర్మన్ కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి అన్నారు. గురువారం కోవెల కుంట్ల పట్టణంలోని పెద్దగ్రౌండులో 2025-26 విద్యాసంవత్సరానికి గాను మండల స్థాయి చాంపియన్ షిప్ క్రీడా పోటీలు ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బనగానపల్లె మార్కెట్ యార్డు చైర్మన్ కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, అవుకు మండల టీడీపీ అధ్యక్షుడు ఉగ్రసేనారెడ్డిలు హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేలబిళం ఆలయానికి నూతన శోభ

అరటి తోరణాలతో భక్తులకు స్వాగతం



ఆలయం చుట్టూ ఏర్పాటు చేసిన అరటి తోరణాలు

కొలిమిగుండ్ల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేలబిళం మల్లేశ్వరస్వామి ఆలయానికి కార్తీక మాసం సందర్భంగా నూతన శోభ సంతరించుకుంది. ఆలయం చుట్టూ ఏర్పాటు చేసిన అరటి తోరణాలు భక్తులను ఆకట్టుకుంది. ఆలయ కమిటీ సభ్యులు, రైతులు తమ పొలాల్లోని అరటి గెలలు తెచ్చి ఆలయం నలువైపులా స్వాగత తోరణంలా ఏర్పాటు చేశారు.

టీడీపీతోనే బీసీల సంక్షేమం

చాగలమర్రి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే బీసీల సంక్షేమం సాధ్యమని మండల బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ గౌడ్ అన్నారు. గురువారం స్థానిక బీసీ సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బీసీల సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్ పదవులు ఇవ్వడం హర్షణీయమన్నారు. కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామతీర్థం, పీరయ్య, లాలయ్య, చిన్నికృష్ణయ్య పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.7.25 లక్షలు

చాగలమర్రి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లాల క్షేత్రం లో చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వరస్వామి ఆలయాలకు చెందిన హుండీ లెక్కింపు పర్యావేక్షణాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. మే 17 నుంచి ఇప్పటి వరకు హుండీ ద్వారా వచ్చిన ఆదాయం రూ.7.25 లక్షలు అన్నారు. 1,400 కిలోల పెసరబెడలకు వేలం పాట ద్వారా రూ.40,600 ఆదాయం వచ్చిందన్నారు. ఆలయ మాన్యం వేలం పాట వాయిదా వేశామన్నారు. ఈవో రమణ, చైర్మన్ నారాయణరెడ్డి, అర్చకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్వదేశీ వస్తువులనే వాడాలి

బనగానపల్లె, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్వదేశీ వస్తువులనే వాడాలని బీజేపీ జిల్లా కార్యదర్శి శివకృష్ణయాదవ్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కంకరగుర్రెడ్డి కళాశాలలో స్వదేశీ వస్తువుల వాడకంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విదేశీ వస్తువులు వాడడం వల్ల దేశానికి జరిగే నష్టాలపై వివరించారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు యాదగిరి, శరత్‌చంద్రకుమార్, తిరుమలయ్య, సుధీర్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

సంజామల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలు సొంత స్థలం కలిగి ఉన్నవారు ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ పథకం కింద పక్కా గృహాలకు దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ బాలచంద్రుడు గురువారం కోరారు. మండల వ్యాప్తంగా అర్హులైన పేదలు ఈ పథకానికి ఈ నెల 30లోపు దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వ గృహాలు మంజూ రవుతాయన్నారు.

వాల్మీకుల మౌనదీక్షను జయప్రదం చేయాలి

కోవెలకుంట్ల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని కలెక్టరు కార్యాలయం వద్ద ఈనెల 9న వాల్మీకుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టే మౌన దీక్షను జయప్రదం చేయాలని కోవెలకుంట్ల పట్టణ వాల్మీకి సంఘం ప్రధాన కార్యదర్శి ఎంవీ సుబ్బయ్య పిలుపునిచ్చారు. గురువారం కోవెలకుంట్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వాల్మీకులు హక్కుల సాధన కోసం ఈనెల 9న కలెక్టరు కార్యాలయం వద్ద మౌనదీక్ష చేపడుతున్నామన్నారు.

పంట నష్టం అంచనాలో రాజకీయం తగదు

- ఎంపీపీ వీరభద్రుడు
- సాదాసీదాగా మండల సమావేశం

చాగలమర్రి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందేలా చూడాలని, పంట నష్టం అంచనాలో రాజకీయం చేయరాదని ఎంపీపీ వీరభద్రుడు అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సమావేశం సాదాసీదాగా జరిగింది. డి.వనిపెంట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 32 మంది విద్యార్థులు ఉన్నారని, కేవలం ఒక ఉపాధ్యాయుడు మాత్రమే బోధన చేస్తున్నారని, అదనంగా మరో ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేయాలని సర్పంచ్ బాలీశ్వర్‌రెడ్డి ఎంఈవోను కోరారు. పంట నష్టం అంచనాలో అవకతవకలు జరుగకుండా చూడాలని ఏవోను కోరారు. భూరీసర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ సూచించారు. అనంతరం ఆయా శాఖల పురోగతిని అధికారులు చదివి వినిపించారు. వర్షాలు కురుస్తుండటంతో వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు ఇమ్రాన్ తెలియజేశారు. గైర్హాజరైన అధికారులపై



మాట్లాడుతున్న ఎంపీపీ వీరభద్రుడు

చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో తాహిర్‌హుసేన్‌కు ఎంపీపీ ఆదేశించారు. కార్యక్ర మంలో మండల ఉపాధ్యక్షుడు ఆశీర్వాదమ్మ, ముల్లారఫి, మాంసాభివృద్ధి సంస్థ రాష్ట్ర డైరెక్టర్ అజీమ్, సింగిల్‌విండో అధ్యక్షుడు ఉసేన్‌రెడ్డి, ఎంఈవో అనూరాధ, ఇన్‌చార్జి సీడీపీ ఉమామహేశ్వరి, ఏవో రంగనేతాజీ, ఏఈలు జగ్గయ్య, నవీన్, పశువైద్యులు సాయిబాబా, దీప, ఈవో తారకేశ్వరి, ఏపీవో ప్రతాప్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం



మాట్లాడుతున్న రాముడు

డోన్ రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గిరిజనుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఏపీ గిరిజన సమైఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మోట రాముడు ఆరోపించారు. గురువారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 10న చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏపీ గిరిజన సమైఖ్య నాయకులు మనోహర్, శేఖర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా

ప్యాపిలి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలపై పోలీసు నిఘా ఉంచినట్లు ఎస్‌ఐ మధుసూదన్ తెలిపారు. గురువారం ఆయన పోలీసు కార్యాలయంలో మాట్లాడుతూ మండలంలో ఎవరైనా మట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.. ఇప్పటికే పలువురు మట్కా బీటర్లపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపామన్నారు. అలాగే నాటు సారా విక్రయాలను కూడా నిర్మూలిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఎక్కడైన పేకాట, మట్కా నిర్వహిస్తుంటే 9121101120 నెంబరుకు సమాచారం అందించాలని ఎస్‌ఐ కోరారు.

అక్షరాస్యతే ప్రభుత్వ లక్ష్యం

కొలిమిగుండ్ల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రతి ఒక్కరూ అక్షరాస్యత సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని వయోజన విద్య జిల్లా నోడల్ అధికారి భాస్కరరెడ్డి అన్నారు. గురువారం కొలిమిగుండ్ల లోని స్త్రీ శక్తి భవన్‌లో 'ఉల్లాస్ అక్షర ఆంధ్ర'లో భాగంగా డీఆర్‌డీఏ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ వలంటీర్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. నోడల్ అధికారి భాస్కరరెడ్డి వయోజన ప్రభుత్వం మంజూరు చేసిన సామగ్రిని వలంటీర్లకు అందజేశారు. ఏపీఎం చంద్రశేఖర్, ఏపీవో నిర్మల పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు



మాట్లాడుతున్న అభిరుచి మధు

బేతంచెర్ల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు అన్నారు. గురువారం పట్టణంలో బీజేపీ మండల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అభిరుచి మధు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలకు తన్ని రకాల సంక్షేమ పథకాలు అందిస్తుందని, ఈ పథకాల గురించి ప్రతి కార్యకర్త తెలుసుకుని ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సందు వెంకటరమణ, నాగమోహన్, బండి కిరణ్, మధు మోహన్ రెడ్డి, ఆంజనేయులు, ఎస్‌వీ రమణ, నాగమోహన్ రెడ్డి, పలుకూరు మోహన్ రెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

- **నాగేంద్ర ప్రసాద్‌కు పరామర్శ:** మండలంలోని ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ వికాస భారతి వ్యవస్థాపకుడు నాగేంద్ర ప్రసాద్‌ను అభిరుచి మధు గురువారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

15న జాబ్ మేళా

ఆళ్లగడ్డ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేవీ సుబ్బారెడ్డి కళాశాలలో ఈనెల 15న ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం టీడీపీ కార్యాలయంలో జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను టీడీపీ నాయకులు భార్గవ్‌రాం నాయుడు, జగత్ విఖ్యాత్‌రెడ్డి ఆవిష్కరించారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఈ మేళాలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు

సమస్యల చెంత .. వారపు సంత

- ఆదాయం ఉన్నా .. సౌకర్యాలు సున్నా
- వర్షం కురిస్తే పరిస్థితి దుర్భరం
- ఇబ్బందుల్లో వ్యాపారులు, వినియోగదారులు

కొలిమిగుండ్ల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కొలిమిగుండ్లలో ప్రతి మంగళవారం నిర్వహించే వారపు సంత .. సమస్యల చింతగా మారింది. సంత మార్కెట్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో వ్యాపారాలు ఎండకు ఎండుతూ .. వానకు నానుతూ .. తీవ్ర కష్టాలు పడుతున్నారు. ప్రతి ఏటా రూ.లక్షల్లో సంత వేలం పాట ద్వారా ఆదాయాన్ని పొందుతున్న గ్రామ పంచాయతీ సౌకర్యాల కల్పనలో దృష్టి సారించడంలేదు. ఏటా రూ.6లక్షలకు పైగా ఆదాయం వస్తున్నా సమస్యలను తీర్చకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతు న్నాయి. కొలిమిగుండ్ల మండలకేంద్రంలో సుమారు పదేళ్లగా వారపు సంత మార్కెట్ నిర్వహిస్తున్నారు. కొలిమిగుండ్లతోపాటు మండలం లోని మీర్జాపురం, పేట్నికోట, నాయినిపల్లె, ఇటిక్యాల, కనకాద్రిపల్లె, కల్వటాల, నందిపాడు, తిమ్మనాయినిపేట, బెలుం, బెలుం శింగవరం, రామాపురం తదితర గ్రామాల నుంచి వందలాది మంది మహిళలు సంత మార్కెట్‌కు కొనుగోళ్ల నిమిత్తం వస్తూ ఉంటారు.

- **షెడ్లు లేక అవస్థలు**

వారపు సంత మార్కెట్‌కు సంబంధించి గ్రామ పంచాయతీ స్థలం, షెడ్లు లేకపోవడంతో వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన



బురదలోనే అమ్మకాలు కొనసాగిస్తున్న వ్యాపారులు

రహదారుల్లోనూ, ప్రైవేటు స్థలాల్లోనూ సంత మార్కెట్ నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఓ ప్రైవేటు వ్యక్తికి చెందిన పొలంలో సంత నిర్వహణ చేపడుతున్నారు. ప్రవేశ రుసుం ద్వారా వందలాది రూపాయలు చెల్లిస్తున్నా పంచాయతీ అధికారులు కనీస వసతులు కల్పించడంలేదని వాపోతున్నారు. షెడ్లు లేకపోవడంతో వర్షం వస్తే వానలోనే నానుతూ బురదలో వ్యాపారం చేసుకునే దుస్థితి నెలకొం దని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండా కాలంలో నీడ కూడా లేకపో వడంతో వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు, తాగునీరు లేవు. గ్రామ పంచాయతీ అధికారులు ఇప్పటికైనా సంత మార్కెట్‌కు స్థలం కేటాయించి, షెడ్లు, కనీస వసతులు కల్పించాలని కోరుతున్నారు.